
# BALA CHELIMI

# APR 2026




BALA

APR

₹40

ఏప్రిల్ - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 7



APRIL - 2026

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



**Puppetry Workshop:** Students explore creativity and storytelling through vibrant puppetry, blending art, expression, and imagination.




## APRIL 2026

**Educational Trip to Kerala:** An enriching journey through the landscapes of Kerala, where students experienced learning beyond the classroom.

Oxford Grammar High School
#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |
| | | | | | | |

**Important Dates**

03 Apr - Good Friday
14 Apr - Dr. B. R. Ambedkar Jayanti

NOTES :


Every lesson you learn today is a step closer to the life you imagine.

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 7 | హైదరాబాద్ Hyderabad | ఏప్రిల్ April | పేజీలు Pages 52 | రూ. ₹. 40







లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| ఆనందమానందమాయె... | మణికొండ వేదకుమార్. | 5 |
| స్వేచ్ఛ, భావప్రకటనా హక్కులకు మద్ధతు పలికిన రసాయన శాస్త్రవేత్త జోసెఫ్ ప్రీస్ట్లీ (సైంటిస్ట్) | జుగాష్విలి | 6 |
| విటమిన్ 'సి' వింతలు (ప్రపంచ విటమిన్ సి దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| ఆరగింపు (పాట)... | గంగదేవు యాదయ్య | 8 |
| శిరీష బండ్ల | షీరోస్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| మేలైన ఆహారం... మెండైనా ఆరోగ్యం (కథ) | జె. శ్యామల | 11 |
| సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్ | డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి | 12 |
| నిరాశ వద్దు (కథ) | పి. హారిక | 13 |
| బొమ్మా - ప్రాణం (ఆట).. | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మర్రి - 11 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| బొమ్మలేద్దామా... | | 16 |
| సామెతలు | | 16 |
| నిజాయితీకి పరీక్ష (కథ) | జి. అక్షయ | 17 |
| పావురాల సంఘబలం | పంచతంత్ర కథ | 18 |
| నేలకొండపల్లి - బౌద్ధస్థూపం | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| వెండి బాతు గుడ్డు (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| ఎవరు గొప్ప? (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| కొంగ - నక్క (కథ) | లకావత్ సుజిత్ కుమార్ | 23 |
| న్యూక్లియర్ సైంటిస్ట్ డా. రాజా రామన్న (సైన్స్ వెన్నెల-18) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| మందార చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| లక్ష్యసాధన (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| బ్యాటింగ్ బలం.. బౌలింగ్ మెరుపు.. టీమిండియా గెలుపు (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| దురాశపరులు (కథ) | వెంగళ నరేష్ | 29 |
| వేమన పద్యాలు | | 30 |

| | | |
|---|---|---|
| చెట్టు రహస్యం (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| అందరి పండుగ అంబేద్కర్ జయంతి (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 33 |
| రెండువేల ఏండ్ల కిందటి కళలు (చరిత్ర పాఠాలు-14) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| నేర్చుకుందామా | | 36 |
| కలం-చెలిమి | | 36 |
| సన్నాయి నొక్కులే గాని, సంగీతం లేదన్నట్లు (సామెతల కథలు - 2)... | బాల కథా సౌరభం | 37 |
| ముందుగా జవాబు - 2 (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 38 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 38 |
| సూపర్ కంప్యూటర్లను మించే శక్తి: క్వాంటమ్ కంప్యూటింగ్ (విద్య) | లత | 39 |
| యువ కర్ణాటక సంగీత ప్రతిభ - గుంటూరు శ్రీ హవాణి | బాలచెలిమి డెస్క్ | 40 |
| సింహం - కుందేలు కథ (పిల్లల కథల్లో సైన్స్-3) | కె శ్రీకృష్ణ సాయి | 41 |
| సుప్రీంకోర్టు అధికార పరిధి - ఐదు రిట్‌ల ప్రాముఖ్యత (జి.కె.) | బాలచెలిమి డెస్క్ | 43 |
| సముద్రంలో వినిపించే మధుర స్వరాలు - బెలుగాస్ | సచిన్ కోత్వాల్ | 44 |
| వేపపువ్వు - బెల్లం (కథ)... | ఓట్ర ప్రకాష్ రావు | 45 |
| బాలచెలిమి గ్రంథాలయం (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అశ్వారావుపేట) | సిద్దాంతపు ప్రభాకరాచార్యులు | 46 |
| పొదుపు (కథ)... | పావని | 47 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 48 |
| ఉర్దూ సాహిత్యానికి కీర్తి తెచ్చిన ప్రముఖ రచయిత్రి పద్మశ్రీ జీలానీ బానూ (వ్యక్తిత్వం) | సువేగా | 50 |


# చెలిమి లేఖలు

శుభోదయం సర్, బాలచెలిమి కోసం వ్యాసాలు రాయడానికి నాకు అవకాశం కల్పించినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీ నిరంతర ప్రోత్సాహం మరియు సహకారానికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. సమాజానికి సేవ చేయడంలో నా వంతు శ్రద్ధతో కృషి కొనసాగిస్తాను.

**- శ్యాంసుందర్ రావు,** టిజిటిడిసి, హైదరాబాద్.

నెల నెల వెన్నెల లాంటి అద్భుతమైన సాహిత్యాన్ని అందిస్తున్నారు. బాల చెలిమి మాసపత్రిక చాలా అద్భుతంగా ఉంది. ప్రతి అంశము కూడా ఎంతో చక్కగా వర్ణించబడింది. ప్రస్తుతము పిల్లలకు బాలసాహిత్యం కరువైంది. ఒకప్పటి చందమామ, బాలమిత్ర లాంటి పత్రికలు రావడం లేదు. ప్రస్తుతం, బాల చెలిమి మాసపత్రిక ఆ లోటు తీర్చింది. ఆర్టికల్స్ కూడా చాలా అద్భుతంగా ఉన్నాయి. ఎంతో ప్రశస్తమైన సాహితీ కృషి చేస్తున్న మీకు మనఃపూర్వక అభినందన చందనాలు.

**- విష్ణు వర్ధన్**

బాల చెలిమి మాసపత్రికలో ప్రచురించిన "పులి జూదం" కథ చాలా బాగుంది. ఇది రాయలసీమ పల్లె ప్రాంతాల్లో ఎక్కువగా ఆడుతారు. బాల చెలిమి మాస పత్రిక నిర్వహిస్తున్న సంపాదకులు శ్రీ వేదకుమార్ మణికొండ గారికి నా ప్రత్యేక శుభాభివందనాలు.

**- జి ఎస్ రామయ్య,** కర్నూల్ INTACH

*Cover Picture*
NAVYA CHHAJER
Class: 3rd
Occasion : Portrayed Buddhism @ OGS 45th Annual Day Celebrations, held at Lalitha Kala Thoranam.



*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728


**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# ఆనందమానందమాయె...

పిల్లలూ....

పరీక్షలయిపోయాయి... హడావిడి, ఒత్తిడి నుంచి బయటికి రండి. ఇక ఉల్లాసంగా, ప్రశాంతంగా, ఆనందంగా గడపండి. సంతోషం, ఆనందం అనేది మనకు మౌళికంగా ఉండవలసిన ఒక లక్షణం. సంతోషం, ఆనందం, ఆహ్లాదం సహజసిద్ధంగా మనిషికి ఉండే జీవన విలువలు. సంతోషం, ఆనందం కలిగిన వాడే నిజమైన సంపన్నుడు. తనకి సంతోషం ఆనందం కలిగించే జీవన విధానాన్ని పాటించే ధైర్యం ప్రతి మనిషికీ ఉండాలి.

ఇష్టమైన విషయాలు, విజయాలు, మంచి అనుభవాలు మనస్సులో పుట్టే సానుకూల భావోద్వేగం ఆనందానికి కారణమవుతాయి. దుఃఖం, బాధ లేనప్పుడు మనస్సు హాయిగా, సంతోషంగా ఉంటుంది. అదే ఆనందం. ప్రశాంతతే ఆనందం. భారతీయ దర్శనాల్లో ఆనందం కేవలం బయటి వస్తువుల వల్ల రావడం కాకుండా మన లోపలి శాంతి, శ్రేయస్సులతో ముడిపడి వుంటుందని బోధిస్తారు. బ్రహ్మానందం, యోగానందం, పరమానందం వంటి ఆనందాలను వర్ణిస్తారు.

ఆనందమంటే మనస్సులో పుట్టే సంతోషంతో కూడిన స్థితి.

ఆనందస్థితిని పొందటం పెద్ద కష్టమేమీ కాదు. మన అలవాట్లు, మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం, మన ప్రవర్తనల వల్ల ఆనందం సిద్ధిస్తుంది. ఆనందం కావాలంటే మన జీవన విధానం బాగుండాలి. మనుషులతో సన్నిహిత సంబంధాలు, స్నేహితులతో, కుటుంబ సభ్యులతో సంభాషణ, దయ, సేవ, సహాయం, క్షమాగుణం గొప్ప సంతృప్తిని ఆనందాన్ని యిస్తాయి. మంచి ఆహారం, కుటుంబమంతా కలిసి భోజనం చేయడం, ఇతరులతో పంచుకోవడం, కృతజ్ఞతాభావం, పిల్లలను, తోటి వారిని ప్రేమించడం, ఆప్యాయంగా, ఆత్మీయంగా కలివిడిగా ఉండటం ఆనందాన్నిస్తాయి. వ్యాయామం, ఈత, నడక, పరుగెత్తడం, ఆటలు మంచి ఆరోగ్యాన్నిస్తాయి. మంచి ఆరోగ్యం ఆనందాన్ని యిస్తుంది. పాటలు, సంగీతం, నృత్యం, బొమ్మలు వేయడం వంటి లలిత కళలన్నీ మానసిక ఆరోగ్యాన్నిస్తాయి. మంచి ఆలోచనలు కలిగిస్తాయి. మంచి ఆలోచనలు సృజనాత్మకశక్తిని, ఊహాశక్తిని, వ్యక్తీకరణ నైపుణ్యాలను యిస్తాయి. ఉత్తమ వ్యక్తిత్వం ఆనందాన్నిస్తుంది. నిజమైన ఆనందం మనిషిని ఉత్తమ వ్యక్తిగా మారుస్తుంది. ప్రతికూల ఆలోచనల (నెగెటివ్ థింకింగ్)కి దూరంగా ఉండాలి. ఇగోలు, పగ, ప్రతీకారాలు, ద్వేషాలు ఆనందాన్ని ఇవ్వవు.



మీకు ఇష్టమైన పనులను, జీవితానికి ఒక లక్ష్యాన్ని ఇచ్చే పనుల్లో పాల్గొనడం దీర్ఘకాలిక ఆనందానికి మంచి మార్గం. లభించిన ఆనందాన్ని కాపాడుకోవడం ఒక అలవాటుగా మార్చుకోవాలి. ఆనందం మీ సామర్థ్యాలను పెంచుతుంది.

ముఖ్యంగా మీ ఆనందాలను ప్రతిరోజూ నిద్రపోయే ముందు మీ డైరీలో రికార్డు చేయండి. రేపు ఈనాటి ఆనందాలను నెమరువేసుకోవచ్చు.

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



## స్వేచ్ఛ, భావప్రకటనా హక్కులకు మద్దతు పలికిన రసాయన శాస్త్రవేత్త

# జోసెఫ్ ప్రీస్ట్లీ

ఆక్సిజన్‌ని కనుగొన్న రసాయన శాస్త్రవేత్త జోసెఫ్ ప్రీస్ట్లీ. జోసెఫ్ ప్రీస్ట్లీ 1733 మార్చి 13న ఇంగ్లాండ్‌లో జన్మించాడు. ఆరేళ్ళ వయస్సులో తల్లి మరణించగా పిన్ని సంరక్షణలో పెరిగాడు. చిన్నప్పటి నుండి తెలివైన విద్యార్థిగా చదువులో ముందుండేవాడు. 11 సంవత్సరాల వయస్సులో గాలి అందకుండా ఉంచినపుడు సాలెపురుగులు ఎంత కాలం జీవిస్తాయో తెలుసుకోవడానికి వాటిని సీసాల్లో బంధించి ప్రయోగాలు చేసాడు. ప్రీస్ట్లీ ట్యూటర్‌గా, ఉపాధ్యాయుడుగా, లైబ్రరీయన్‌గా పని చేశాడు.

1774లో పారె ఆక్సైడ్స్ వేడి చేసి ఆక్సిజన్ వాయువును వేరు చేసి కనుగొన్నాడు. దీనిని డెఫ్లాజిస్టికేటెడ్ ఎయిర్ అని పిలిచాడు. వివిధ గ్యాస్‌లపై ప్రయోగాలు చేసాడు. 1772లో నైట్రిక్ ఆసిడ్ (లాఫింగ్ గ్యాస్), హైడ్రోజన్ క్లరైడ్ (సాల్ట్ ఆక్సైడ్ ఎయిర్), అమ్మోనియా (ఆల్కలైన్ ఎయిర్) సల్ఫర్ డయాక్సైడ్ (విటి) లను మొదటిసారిగా వేరు చేసాడు. కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్‌తో కూడిన కార్బోనేటెడ్ వాటర్ (సోడా వాటర్)ను తయారు చేసాడు.



ప్రీస్ట్లీ ఆవిష్కరించిన గ్యాస్‌లు ఆధునిక రసాయనం, వైద్యం, పరిశ్రమల్లో విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. ఆక్సిజన్ ($O_2$) వైద్యరంగంలో శ్వాసకోశ సమస్యలకు, ఆర్క్ వెల్డింగ్‌లో, జలశుద్ధీకరణలో ఉపయోగిస్తారు. హైడ్రోజన్ క్లరైడ్ HCl ఆసిడ్ తయారీకి, పివిసి ప్లాస్టిక్, ఫార్మా స్యూటికల్స్‌లో ఉపయోగిస్తారు. అమ్మోనియా ఫర్టిలైజర్స్ (యూరియా) ప్లాస్టిక్ తయారీలో ఉపయోగిస్తారు. సల్ఫర్ డయాక్సైడ్ వైన్ తయారీలో, కార్బన్ డయాక్సైడ్ మెటలర్జీలో ఉపయోగిస్తారు.

ప్రీస్ట్లీ ప్రయోగ ఫలితాలు పర్యావరణంపై సానుకూల, ప్రతికూల ప్రభావాలను చూపుతున్నాయి. ఆక్సిజన్ వాడకం వల్ల జీవుల శ్వాసక్రియ మెరుగుపడుతుంది. ఫర్టిలైజర్లు వ్యవసాయోత్పత్తులను పెంచుతున్నాయి. కార్బన్ డయాక్సైడ్ గ్లోబల్ వార్మింగ్‌కి, సల్ఫర్ డయాక్సైడ్ వాయు కాలుష్యాన్ని పెంచి శ్వాసకోశ సమస్యలకి, నైట్రస్ ఆక్సైడ్ ఓజోన్ లేయర్ డిప్లీషన్‌కీ కారణమై పర్యావరణ, ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి. అయితే పరిమిత వినియోగం, క్లీన్ టెక్నాలజీల ద్వారా వీటి ప్రభావాన్ని తగ్గించవచ్చు.

ప్రీస్ట్లీ ప్రయోగాలు ప్రకృతి, గ్యాస్ వ్యవస్థల గురించి అవగాహన పెంచాయి. ఆధునిక పర్యావరణ శాస్త్రానికి పునాది వేశాయి. ఆధునిక గ్రీన్ థింకింగ్‌కి ప్రేరణ యిచ్చాయి.

జోసెఫ్ ప్రీస్ట్లీ ఒక క్లాసికల్ లిబరల్ సిద్ధాంతకారుడు. మత సహనం, మరియు వ్యక్తిగత స్వేచ్ఛలకు మద్దతుగా నిలిచాడు. యేసు, సోక్రటీస్‌ల సామ్యతలను పోల్చి మత విమర్శకు పునాదులు వేసిన దార్శనికుడు. స్వేచ్ఛగా మాట్లాడటం, బహిరంగ చర్చల ద్వారా ప్రోగ్రెస్ సాధ్యమని నమ్మాడు. విజ్ఞానం, విద్య, మత మరియు రాజకీయ సంస్కరణల ద్వారా మానవ జాతి నైతికంగా, భౌతికంగా అభివృద్ధి చెందగలదని ఆయన నిశ్చితాభిప్రాయం. ప్రీస్ట్లీ రాజకీయ, మత విశ్వాసాల కారణంగా 1791లో ఇంగ్లండ్‌లో బర్మింగ్‌హాంలోని ఆయన యింటిపై దాడి చేసి ఇంటిని, లైబ్రరీని, ప్రయోగశాలను ధ్వంసం చేశారు. 1794లో అమెరికా వెళ్ళి పెన్సిల్వేనియాలో స్థిరపడి అక్కడ విలువైన ప్రయోగశాలను ఏర్పాటు చేసుకున్నాడు. మతం, రాజకీయాలు, విద్య, భాషావ్యాకరణం అంశాలుగా 150 పుస్తకాలు రాసాడు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో 1804 ఫిబ్రవరి 6న మరణించారు. తన ప్రయోగశాలను 1963లో పునరుద్ధరించారు. 1994లో నేషనల్ కెమికల్ ల్యాండ్ మార్క్‌గా గుర్తింపు పొందింది. ఇప్పుడు మ్యూజియంగా పరిశీలకులకు అందుబాటులో ఉంది.

ప్రీస్ట్లీ రసాయన శాస్త్రవేత్తగా, లిబరల్ రాజకీయాలకు ప్రేరణగా, స్వేచ్ఛకి, భావ ప్రకటనా హక్కులకి మద్దతుదారుగా చిరస్మరణీయుడు.

– జుగాష్విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998



# National Vitamin C Day

# విటమిన్ 'సి' వింతలు

సంచి నిండా ఉసిరి కాయలతో ఎక్కడికి వెళ్తున్నావు అంటూ 'ఉమ'ని పద్మ పలకరించింది. "మా బామ్మ ఉసిరి కాయలతో జామ్ చేస్తుంది. నాకు చాలా ఇష్టం. అందుకని బామ్మ దగ్గరికి వెళ్తున్నా"నంది. "నువ్వేంటి జామ, నారింజ, పనస పళ్లతో ఎక్కడికి వెళ్తున్నావని పద్మని" ఉమ అడిగింది. ఇవి మామూలు పళ్లు కావు, విటమిన్‌లు అంది. బ్రోకలి, టామాటా, క్యాబేజీ పట్టుకొని మనోజ్ వాళ్లని కలిసాడు. వాళ్లని చూసి పద్మా వాళ్ల నాన్న "ఈ మార్కెట్‌లోనే అందరూ 'విటమీన్ సి క్లబ్' పెట్టారేంటని" అడిగాడు. విటమిన్ సి క్లబ్ గురించి మాకు తెలీదే అన్నారు. సరే మనందరం 'ఇక్కడ జ్యూస్ షాప్‌లో ఆరెంజ్ జూస్ తాగుతూ దాని గురించి మాట్లాడుకుందాం' అన్నాడు.

'Information, meterials on the benefits of vitamins, improve the quality of life'.

పిల్లలూ మీరందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా మీకు రోగనిరోధక శక్తి కావాలి. అలాగే ఉత్సాహంగా ఏ పని చేయడానికైనా మన ఎముకలు గట్టిగా ఉండాలి. వాటికి ఆహారంతో పాటు పళ్లు తినడం చాలా అవసరం. ఎందుకంటే పళ్లలోనే మనకు కావలసిన ఇమ్యూనిటీని పెంచి, ఆరోగ్య సమస్యలు రాకుండా చూసే విటమిన్‌లు ఉంటాయి. పూర్వకాలం అంటే 17, 18 శతాబ్దాలలో సముద్రాలలో పడవలపై నావికులు నెలల తరబడి ప్రయాణించేవారు. వారు కడుపు నిండా తిన్నా, చర్మం పై దద్దుర్లు వచ్చి రక్తం కారేది. అలాగే చిగుళ్ల నుంచి రక్తం కారేది. అలా ఎందరో ప్రాణాలను కూడా కోల్పోయారు.

ఆ సమయంలోనే హంగేరీకి చెందిన 'Albert szent - Gyorgy' అనే శాస్త్రవేత్త సిట్రిక్ ఆసిడ్ దాని పనితీరు, మానవాళి పై దాని ప్రభావం గురించి పరిశోధనలు చేసాడు. ఆ పరిశోధనలకు 'Albert szent-Gyorgy' కి నోబుల్ బహుమతి కూడా లభించింది. Vital, Amines అనే పదాల నుండి vitamins అనే పదం రూపొందింది. విటమిన్ సి యొక్క రసాయనిక నామం ఆస్కారిక్ ఆమ్లం. ఇది గాయాలు త్వరగా మానడానికి, విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవడానికి ఉపయోగపడుతుంది. అంతేకాక దంతాలలో జెంటిన్ అనే పదార్థం ఏర్పడడానికి దోహదపడుతుంది. అయితే విటమిన్ సి నీటిలో కరిగే విటమిన్. అందువల్ల ప్రతిరోజూ విటమిన్ సి ని ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్రతి విటమిన్ కు మనిషి ఆరోగ్యాన్ని రక్షించటంలో ప్రత్యేక పాత్ర ఉంటుంది. విటమిన్ల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'విటమినాలజీ' అంటారు.

1932లో 'ఛార్లస్ గ్లెన్ కింగ్' సి విటమిన్ లోపం స్కర్వీ వ్యాధికి కారణమని పరిశోధనల ద్వారా కనుగొన్నాడు. భారతదేశంలో సి విటమిన్ లోపంతో పిల్లలు, పెద్దలు స్కర్వీ

వ్యాధిన పడుతున్నట్లు గుర్తించారు. అంతే కాక డిప్రెషన్, ఆకలి తగ్గడం లాంటి సమస్యలు కూడా వస్తున్నట్లు గమనించారు. 2019 నుండి 'ఏప్రిల్ 4వ తేదీన' విటమిన్ సి దినోత్సవాన్ని (National Vitamin-C Day) జరుపుకోవాలని మెడికల్ అసోసియేషన్ ప్రతిపాదించింది. ఈ ఉత్సవాల్లో భాగంగా విటమిన్ సి యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కలిగిస్తారు. అది లభించే పళ్ళు, కూరల గురించి ప్రచారం చేస్తారు.

అందుకే కోవిడ్-19 మహమ్మారి సమయంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరుచుకోవడానికి విటమిన్ సి మాత్రలను చాలా మంది వాడారు.

పిల్లలూ మన ఆరోగ్యం తాజా పండ్లలో, ఆకుకూరల్లో ఉంది. అవి మనకు కావలసిన విటమిన్ లను అందించి, శారీరిక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయి. పండంటి ఆరోగ్యానికి రోజుకో పండు అని గుర్తించండి. పాటించండి.


Happy vitamin C-DAY. Hereμs to your healthy and happiness.

– డా. నీరజ అమరవాది
m : 9849160055

పాట

# ఆరగింపు

సాట్ల బియ్యం చెరిగింపు
గిన్నెల బియ్యం గాలింపు
కడిగిన బియ్యం ఉడికింపు
పప్పూ... పులుసూ తాలింపు
ఒక్కొక్క ముద్దా లాగింపు
కమ్మగ వేడిగ ఊరింపు
అంతా మొత్తం ఆరగింపు..!



– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**

విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# శిరీష బండ్ల

## భారత-అమెరికా సంతతికి చెందిన ఏరోనాటికల్ ఇంజినీర్, అంతరిక్ష యాత్రికురాలు

శిరీష బండ్ల (1987 - ) భారత-అమెరికా సంతతికి చెందిన ఏరోనాటికల్ ఇంజినీర్, వాణిజ్య వ్యోమగామి. ఆంధ్ర ప్రదేశ్, గుంటూరులో తెలుగు మాట్లాడే కుటుంబంలో పుట్టిన శిరీష బండ్ల కథ కలల శక్తికి, శ్రమకు నిదర్శనం. ఆమె కుటుంబం అమెరికాలోని హ్యూస్టన్‌కు వెళ్లడంతో ఆమె అద్భుత విజయాలకు అది వేదికగా నిలిచింది. పర్డ్యూ విశ్వవిద్యాలయం నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. తరవాత జార్జిటౌన్ విశ్వవిద్యాలయం నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు.




2015లో అంతరిక్ష ప్రయాణ రంగంలో అగ్రగామి సంస్థ అయిన వర్జిన్ గెలాక్టిక్‌లో చేరినప్పుడు వృత్తిని కీలక మలుపు తిప్పే సాహసయాత్ర ఆమె ప్రారంభించారు. 2021 జులై 11, ఆదివారం నాడు వర్జిన్ గెలాక్టిక్ 22లో అంతరిక్షంలోకి దూసుకుపోయారు.

విమాన ప్రయాణంలో ఆమెను ఫ్లైట్ క్రూ సభ్యురాలిగా చెప్పనప్పటికీ (వివిఎస్-01 ఒక ఆటోమేటెడ్ లాంచ్), ఫెడరల్ ఏవియేషన్ అథారిటీ ఆమెను అంతరిక్ష యాత్రికురాలిగా గుర్తించింది. ఆమె ప్రయాణం చరిత్ర సృష్టించింది. భూమి అంచులు దాటి సాహసం చేసే అతి కొద్ది మంది వ్యక్తులకు మాత్రమే ఇలాంటి విజయం దక్కుతుంది.

గొప్ప కలలు కనే ధైర్యం, ఆ కలలు సాకారం చేసుకోవడానికి కష్టపడటం, అనంత అవకాశాలు అంది పుచ్చుకోవడం ఎలా సాధ్యమో ఇంజినీరింగ్ నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు సాగిన శిరీష బండ్ల ప్రయాణం ఒక ఉదాహరణ.

- 'షీరోస్-256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

కల్పనా చావ్లా తరవాత అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతికి చెందిన రెండో మహిళ శిరీష.



# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం

హర మంటే అల్లరని తెలుసా?
హల మంటే నాగలని తెలుసా?
హయ మంటే గుర్రమని తెలుసా?
"హంస"లో మొదటి అక్షరమేది? "హ" అక్షరం





కళ్ళంలో వడ్లు వానతో తడిసాయి
కళ్ళం అంటే ధాన్యం శుభ్రం చేసే స్థలం
కళ్ళం నడుమ నేనుంటాను.
అది నేనెవరో చెప్పుకోండి? "ళ" అక్షరం

వీక్షణ మంటే చూచుటని తెలుసా?
భక్షణ మంటే తినటమని తెలుసా?
రక్షణ మంటే కాపాడుటని తెలుసా?
"రక్షణ" నడుమ ఏ అక్షరముంది? "క్ష" అక్షరం





అక్కుట అంటే గీకుటని తెలుసా?
అంపము ఎపుడైనా చూశారా?
అంపము ముందు నేనుంటాను
అది నేనెవరో తెలుసా మీకు? "అ" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

కథ




# మేలైన ఆహారం... మెండైనా ఆరోగ్యం

అది 'వాణీ విద్యాలయ' స్కూల్. లంచ్ బెల్ మోగడంతో పిల్లలంతా తమ టిఫిన్ బాక్సులు తీసుకుని స్కూలు ఆవరణలోని చెట్ల వద్దకు చేరారు. ఆరో తరగతి విద్యార్థులైన అభిజిత్, నిశాంత్, అద్విక్ కూడా అక్కడికి చేరి, తమ బాక్సులు తెరిచారు. అభిజిత్ బాక్సులో ఆకుకూర పప్పు చూడగానే, నిశాంత్ నవ్వుతూ "ఒరే అభీ! ఈ రోజూ ఆకు కూర పప్పేనా? వారంలో నాలుగు రోజులు అదే తెచ్చుకుంటావు. నీకు బోర్ కొట్టదా? చివరికి నువ్వు పప్పు గాడివి అయ్యేట్లున్నావు" అన్నాడు. అద్విక్ అందుకుని "చీప్‌గా వస్తుందని వాళ్ళింట్లో అదే వండుతారులేరా" అన్నాడు ఎగతాళిగా.

అభిజిత్‌కి వాళ్ళ మాటలు అవమానంగా అనిపించాయి. "మా అమ్మ ఆకు కూర ఆరోగ్యం అంటుంది. తిననంటే ఊరుకోదు. మీరు లక్కీరా, ఏం చేస్తాం" అన్నాడు.

"ఏం చేస్తావులే.. మీ అమ్మ చెప్పినట్లు ఆకుకూర పప్పు, బెండకాయ కూర, గోంగూర పచ్చడి, మొలకెత్తిన శనగలు, పెసలు, కీరా, క్యారట్ ముక్కలు, పళ్ళు, డ్రై ఫ్రూట్లు తింటూ ఉండు. మేమంతా హాయిగా పనీర్, చీజ్ కలిపి చేసే స్పెషల్స్, వేపుడు కూరలు, రకరకాల టేస్టీ స్నాక్స్, ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్ తీసుకుంటూ ఎంజాయ్ చేస్తాం" గొప్పగా అన్నాడు నిశాంత్.

అభిజిత్ చిన్నబుచ్చుకుని, అయిష్టంగా తినసాగాడు. తరచు వారి మధ్య ఇలాంటి సంభాషణ జరుగుతూనే ఉంటుంది. జంక్ ఫుడ్ తినకూడదని అమ్మ చాలా గట్టిగా చెప్పడంతో, వాళ్ళతో అభిజిత్ కలవలేదు. అది వారికి ఎగతాళి.

ఇంటికి వెళ్ళాక అభిజిత్ అమ్మ మీద అలిగాడు. అమ్మ కారణం అడిగింది. "నేను రోజూ ఆకుకూర పప్పు తింటానని ఫ్రెండ్స్ వెక్కిరిస్తున్నారు. వాళ్ళతో పాటుగా క్యాంటీన్‌లో స్నాక్స్ కొనుక్కోనని, కూల్ డ్రింక్స్ తాగనని నవ్వారు" కోపంగా అన్నాడు.

"ఓస్ అంతేనా. వాళ్ళకు తెలియక అంటున్నారు. కొంతకాలం గడిచాక వాళ్ళకే తెలిసివస్తుంది. బయటి తిళ్ళు తినడం, ఆ రంగు నీళ్ళు తాగడం మంచిది కాదు. ఈ కాలంలో ఎక్కడ ఏ కల్తీ జరుగుతుందో తెలియదు. మన ఆరోగ్యం మనం చూసుకోవాలి. నీ మంచికే చెపుతాను. నా మాట విను" అంది అమ్మ.

ఇక లాభం లేదని మౌనం వహించాడు అభిజిత్.

* * *

ఆ రోజు సైన్స్ టీచర్ పౌష్టిక ఆహారం గురించి చెప్పింది. "ఇప్పుడు నేను చెప్పిన ఆహారపు అలవాట్లను మీలో ఎవరైనా పాటిస్తున్నారా?" అడిగింది టీచర్.

"అభిజిత్ పాటిస్తాడు" నవ్వుతూ చెప్పారు నిశాంత్, అద్విక్. "అయితే అభిజిత్ గుడ్ బాయ్ అన్నమాట. నీకు మంచి ఆహారపు అలవాట్లను నేర్పుతున్నందుకు మీ అమ్మకు అభినందనలు చెప్పాలి. మీరంతా కూడా అభిజిత్ ను చూసి నేర్చుకోండి. పౌష్టిక ఆహారం తీసుకుని, ఆహారంలో సమతుల్యత పాటిస్తే మీరంతా ఆరోగ్యంగా ఉంటారు. లేదంటే ఆరోగ్య సమస్యలు వస్తాయి" చెప్పింది.

"అయితే అమ్మ చెప్పింది కరెక్టే అన్న మాట" అనుకున్నాడు అభిజిత్.

* * *

రోజులు గడుస్తున్నాయి. స్కూల్లో ఒకరోజు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నిశాంత్, అద్విక్ వయసుకు మించిన బరువున్నారు. ఇద్దరికీ దంతాలు పాడయ్యాయి. చాక్లెట్లు తినడం తగ్గించమని, వెంటనే దంత వైద్యుడిని సంప్రదించమని డాక్టర్ చెప్పారు. కానీ ఆ మాటలను ఇద్దరూ పట్టించుకోలేదు. స్కూల్లో ఆటల పోటీలు పెట్టారు. అభిజిత్ రన్నింగ్ రేస్‌లో ఫస్ట్ వచ్చాడు. నిశాంత్, అద్విక్ కాస్త పరుగెత్తగానే ఆయాసపడ్డారు. అంతేకాదు, తరచు జలుబు, దగ్గు, జ్వరం రాసాగాయి. ఆర్నెల్ల పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. నిశాంత్‌కు జ్వరం వచ్చింది. అద్విక్ జలుబు, దగ్గుతో బాధ పడుతున్నాడు. అభిజిత్ మాత్రం చురుగ్గా ఉంటూ, స్కూలుకు క్రమం తప్పకుండా హాజరవుతూ, బాగా చదువుతున్నాడు. అభిజిత్ పరీక్షల్లో క్లాస్ ఫస్ట్ వచ్చాడు. స్కూల్ వార్షికోత్సవం రోజు చదువులో, ఆటల్లో, వివిధ అంశాల్లో బహుమతులు గెలుచుకున్నాడు. నూరు శాతం హాజరుకు ప్రత్యేక బహుమతి అందుకున్నాడు.

నిశాంత్, అద్విక్‌లకు తమ అలవాట్లు, పొరపాట్లు గుర్తుకు వచ్చాయి. వెంటనే అభిజిత్‌ను కలిసి అభినందించి "ఇదివరకు నిన్ను చాలా వెక్కిరించాం. సారీ రా. మేం ఇష్టం వచ్చినట్లు జంక్ ఫుడ్ తిని ఆరోగ్య సమస్యలతో చదవ లేకపోయాం. ఇక నుంచి మేం కూడా మంచి ఆహారపు అలవాట్లను అనుసరిస్తాం" అన్నారు.

అభిజిత్ స్నేహంగా వారి భుజాల మీద చేతులు వేసి "ఫ్రెండ్స్ మధ్య సారీలు ఎందుకురా, మీరు మారారు. నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు.

– జె. శ్యామల
m : 9989601113

# సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్



డిజిటల్ యుగంలో మానవ జీవనశైలి సమూలంగా మారిపోయింది. ముఖ్యంగా, యువ ఉద్యోగులను మరో నిశ్శబ్ద విపత్తు భయపెడుతున్నది. ఉదయం నిద్ర లేసినప్పటి నుండి మళ్లీ పడుకునే వరకు నిశ్చలంగా కూర్చోవడం పెరిగి పోతున్నది. ఉదయం నిద్ర లేచి పేపర్ చదువుతూ, టివీ చూస్తూ, సెల్ ఫోన్‌లో మునుగుతూ, కాఫీ తాగుతూ కూర్చుండి పోతున్నాం. భోజనాల సమయంలో కూర్చుంటున్నాం. కార్యాలయానికి వెళ్లడానికి కారులో కూర్చుంటున్నాం. ఆఫీస్‌లో కూర్చొని గంటల తరబడి విధులు నిర్వహిస్తున్నాం. సాయంత్రం కారులో కూర్చొని ఇంటికి చేరడం, కూర్చొని టివీ లేదా స్మార్ట్‌ఫోన్‌లో దూరడం లేదా ఈవినింగ్ పార్టీలు చేసుకుంటూ 2–3 గంటలు గడుపుతున్నాం. ఈ విధంగా రోజుకు సగటున 10 గంటల వరకు నిశ్చలంగా కూర్చొనే జీవన విధానాన్ని అలవర్చుకుంటున్నాం. గంటల తరబడి కదలకుండా కూర్చోవడం వల్ల ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ "సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్ (కూర్చోవడం నిన్ను చంపుతుంది)" అనే సరికొత్త ప్రమాదకర "కూర్చోవడం కొత్త ధూమపానం" లాంటిదని వర్ణించబడుతున్నది.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
m : 9949700037

కథ

# నిరాశ వద్దు



విశ్వాస్ బాధపడడం గమనించిన తల్లి భారతి దగ్గరకు వచ్చి, 'ఏమైంది? నాన్న ఎందుకు బాధపడుతున్నావ'ని అడిగింది. అప్పుడు విశ్వాస్ అమ్మను చూసి 'అమ్మ నాకు మా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం కావడం లేదు. నాకు అందరి కన్న తక్కువ మార్కులు వస్తున్నాయి. చదువు పట్ల ఆసక్తి లేదు. నేను చదువుకోను. నేను దేనికి పనికి రాను కావచ్చు. నేను పాఠశాలకు వెళ్ళాలంటే భయం అవుతుంది' అని అంటాడు.

అప్పుడు తల్లి భారతి ఇలా అంటుంది 'ఒకసారి ఆ చెట్టును చూడు. ఆ చెట్టుకు నీడ ఉంటే పెరగదు. కానీ ఎండ తగిలితే పెద్దగా అవుతుంది. ఒక ఎండ మాత్రమే కాదు దానికి నీరు, గాలి ఉంటే ఒక పచ్చని చెట్టులాగ మారుతుంది. మొదటగా అది ఒక మొక్క, కాని అది ఇప్పుడు ఒక చెట్టు. చెట్టులాగా మారాలి అంటే అది ఎన్నో ఎదురు దెబ్బలను తట్టుకొని నిలబడింది. అది ఒక మొక్క లాగ ఉన్నప్పుడు పెద్ద గాలి వస్తే ఉక్కిరి బిక్కిరి అయ్యేది. కాని ఇప్పుడు ఎంత పెద్ద గాలి వచ్చినా దానికి ఏమీ కాదు.

ఇప్పుడు ఆ చెట్టు ఎంతో మందికి తినడానికి పండ్లనిస్తుంది. పిల్లలు ఆడుకోవాలంటే నీడనిస్తుంది. పక్షులకు నివాసమైంది. ఇలా ఎందరికో అది ఉపయోగ పడుతుంది. ఒకవేళ ఆ చెట్టు మొక్కగా ఉన్నప్పుడు అది పెనుగాలిని తట్టుకొని నిలబడలేకపోతే ఇప్పుడది పెద్ద వృక్షమయ్యేది కాదు. చెట్టును స్ఫూర్తిగా తీసుకొని మనము కూడా ఎదగాలి. మన జీవితంలో కష్టాలు సహజం. వాటిని తట్టుకొని నిలబడాలి. మనం ఎదుగుతున్న క్రమంలో ఎదురు దెబ్బలు తగులుతూ ఉంటాయి. వాటిని మనం పట్టించుకోకుండా ముందుకు వెళ్ళాలి. మనల్ని చూసి ఎదుటివారు ఆదర్శంగా తీసుకోవాలి.

నాకు ఏది వస్తలేదు అని వదిలేయకూడదు. సాధించే వరకు కష్టపడుతూనే ఉండు. నువ్వు చదువు పట్ల నిర్లక్ష్యంగా ఉన్నావు. నువ్వు ఉదయం లేచి చదువు. అర్థం కాకపోతే ఉపాధ్యాయులను అడుగు వారి యొక్క సలహాలను విను.

భయం వదిలేసి నేటి నుంచి కష్టపడు. నువ్వు ఏది గాని నాకు రాదు అని అనుకోకు. వచ్చేవరకు కష్టపడు' అని చెప్తుంది.

'అనవసర భయాలు, అపనమ్మకాలు వద్దు. ఇతరులతో పోల్చుకోకు. ప్రతివారి లోపల ఏదో ఒక కళ ఉంటుంది. మార్కులు తక్కువ వచ్చినంత మాత్రాన నిరాశపడకూడదు. దాని నుండి బయటపడడానికి ఆటలు, పాటలు ఎంతగానో దోహదపడతాయి. అంతేగాదు మంచి మంచికథల పుస్తకాలు చదువు. నేను కూడ నీకు కథలు, పాటలు చెబుతాను' అంటూ అమ్మ మనోధైర్యాన్ని నూరిపోసింది.

అమ్మ మాటల్తో విశ్వాస్‌లో మార్పు మొదలైంది.

– పి. హారిక
8వ తరగతి, జి.ప.ఉ.పా. లింగారెడ్డిపల్లి.
m : 94920 05349

# బొమ్మా - ప్రాణం



ఎంత మంది పాల్గొనవచ్చు - ఎంతమందైనా ఆడవచ్చు

ఎక్కడ ఆడవచ్చు - ఖాళీ స్థలంలో

ఈ ఆటకు గల ఇతర పేర్లు - స్టాచ్యు ఆట, శిల్పం - ప్రాణం, కూర్చుంటే కుర్రు


'బొమ్మా - ప్రాణం' ఆటలో అందరూ పంటలు వేశాక దొంగ అయిన బాలుడు లేదా బాలిక మిగతా పిల్లల వెంటపడి పట్టుకోవాలి. ఆ పిల్లలు పరుగెత్తి దొంగ తమ దగ్గరకు రాగానే "బొమ్మ / స్టాచ్యు" అని చెప్పుకొని వెంటనే బొమ్మలా కదలకుండా నిలబడి పోవాలి. దొంగ అతన్ని తాకకుండా మిగతా వారి వెంట పడతాడు. వాళ్ళు అలా పరిగెత్తి తప్పించుకుంటారు. వాళ్ళు పరుగెత్తుతూ ఇంత క్రితం బొమ్మలా నిలబడిపోయిన వారిని తట్టి. 'ప్రాణం / మూవ్' అని అనగానే అతను పరుగెత్తవచ్చు.

దొంగ ఎవరిని పట్టుకుంటే వారు దొంగ అవుతారు. ఇలా ఆట రొటేషన్ అవుతుంది. ఒక వేళ అందరూ బొమ్మలుగా అయిపోతే మొదట బొమ్మలా నిలబడిన వారు దొంగవుతారు.

**ప్రయోజనం:**

ఈ ఆట ద్వారా పిల్లలు ఒకరికొకరు సహాయ పడటం, ఏ పనికైనా వెంటనే స్పందించడం నేర్చుకుంటారు.

- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...



సీరియల్-11

(గత సంచిక తరువాయి...)

# బంగారు పుత్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)

అది హైదరాబాదు మహానగర శివారులోని రాజేంద్రనగర్ ప్రాంతం. రాత్రి 11 గంటల సమయం. ఆ సమయంలో ఆ ప్రాంతమంతా నిర్మానుషంగా ఉంది. హైవే మీద అక్కడక్కడ కార్లు, లారీలు వేగంగా పరుగులు తీస్తున్నాయి. రాజేంద్రనగర్ రైస్ రిసెర్చ్ సెంటర్ దగ్గర హైవే మీద ప్రయాణించే లారీ వాళ్లు, ఎయిర్ పోర్టుకు వెళ్లే క్యాబ్ డ్రైవర్లు వేడి వేడిగా చాయ్ తాగుతుంటారు. అక్కడ ఉండే కరీం భాయ్ చాయ్ దుకాణంలో పొయ్యి ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుంది. గరం గరం చాయ్ అక్కడ కమ్మటి రుచితో ఉంటుందని పేరుంది. ఆ హైవేలో కరీం చాయ్ దుకాణం దగ్గర చాయ్ తాగి వెళ్ళటం అందరికీ అలవాటుగా మారింది. హైదరాబాదులో రెండు రోజులుగా ముసురు వాన పడుతుంది. గంటపడితే గంట ఆగుతూ కురుస్తూనే ఉంది. ఆ రోజు దుకాణం దగ్గర పెద్దగా వాహనాలు లేవు. అక్కడక్కడా లారీలు నిలిచి ఉన్నాయి. ముసురు వాన కావటంతో ప్రయాణికులు కూడా పెద్దగా బయటకు రాలేదు.

ఇద్దరు యువకులు కరీం చాయి దుకాణం బయట ఉన్న బల్ల మీద కూర్చోని వేడి వేడి చాయ్ తాగుతున్నారు. ఒకడు దూరంగా లారీ వెనుక చీకట్లో కదులుతున్న ఆకారాన్ని చూస్తూ ఉండిపోయాడు.

“క్యా దేక్ రే భాయ్! పీవో చాయ్!” అన్నాడు లారీ వైపు చూస్తూ!

“భయ్యా! యేదేకో షేర్!”

“పాగల్ హై క్యా! పీవో చాయ్!”

హైవే మీదుగా పోతూ అక్కడ ఆగిన మరో లారీ లైట్ల వెలుతురు ఆ ఆకారం మీద పడింది.

“అరే, బాప్ రే! యే షేర్ హై! భాగోరే భయ్యా!” అన్నాడు పెద్దగా.

పులి పెద్దగా గాండ్రిస్తూ పదునైన పంజాని లారీ లైట్ల మీదకు విసిరింది. లారీ లైట్లు పగిలి చీకటయింది. ఆ యువకుల్నిద్దరూ తమ లారీ వైపు పరిగెత్తారు. పులి పెద్దగా గాండ్రిస్తూ వారిని వెంబడించింది. మెరుపు వేగంతో లారీ

ఎక్కి పులి పంజా నుంచి తప్పించుకున్నారు. కరీంకు ఎటు పరిగెత్తాలో తెలీలేదు. వెంటనే దుకాణంలోకి దూరి షెటర్ వేసుకున్నాడు. పులి పంజాతో షెటర్‌ను బాది అక్కడి నుంచి కదిలింది. కరీం సెల్‌ఫోన్‌లో మాట్లాడి పోలీసులకు సమాచారం అందించాడు.

వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కరీం దుకాణం షట్టర్ లేపి బయటకొచ్చాడు.

“నమస్తే సాబ్! నేనే మీకు ఫోన్ చేసింది” అన్నాడు కరీం.

“పులిని ఎక్కడ చూశారు?” అడిగాడు ఎస్.ఐ.

“ఆడ కనిపించే లారీ వెనుక నుంచి వచ్చి మా మీద దాడి చేసింది సాబ్!”

ఎస్.ఐ ఆ పరిసరాలు పరిశీలనగా చూశాడు. ఇంతలో పులి దాడి నుంచి తప్పించుకున్న ఇద్దరు యువకులు కూడా దిగివచ్చి పోలీసులకు వివరాలు చెప్పారు.

“కానిస్టేబుల్స్! మనం వెంటనే సి.సి కెమేరాలో పులి కదలికలు పరిశీలించాలి!” అన్నాడు ఎస్.ఐ.

“అలాగే సార్!” ట్యాబ్‌లో gCMOB యాప్ ఓపెన్ చేసి పులి దాడి చేసిన దృశ్యాలు చూశారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని సి.సి. కెమేరా ఫుటేజ్ పరిశీలించి పులి ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కినట్లు గ్రహించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్వాహకులకు సమాచారం అందించి పులి దిరుగుతున్న విషయం చెప్పారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రెస్ మీట్ పెట్టి సి.సి. ఫుటేజ్ చూపించారు. తమ యాక్షన్ ప్లాన్ వివరించారు. ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింటింగ్ మీడియా రకరకాల ప్రశ్నలు వేస్తున్నారు. అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు యిస్తున్నాడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్.

“సార్! అడవిలో ఉండాల్సిన పులి అడవి దాటి నగరానికి ఎందుకు వచ్చింది!?”

“సుమారుగా పులి వయసు ఎంత ఉంటుంది?”

“దీని ఆకారం, పాదముద్రలు బట్టి ఐదు సంవత్సరాలు ఉండవచ్చు.”

“వచ్చింది ఆడ పులా? మగ పులా?”

పులి పాద ముద్రలు గమనించాము. 14 సెం.మీ పంజా సైజు బట్టి చూస్తే మగ పులి అని తెలుస్తుంది. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ

m : 92475 64699

## బొమ్మలేద్దామా...





బి. చాహ్నీ కృష్ణ, 8వ తరగతి, 13 సంవత్సరాలు, జెనీవా, స్విట్జర్లాండ్.

## సామెతలు

- అందని మానిపండ్లకు అర్రులు సాచినట్లు.
- ఆవు నలుపైతే పాలు నలుపా?
- ఇంట్లో పిల్లి, బయట పులి.
- ఉపాయమున్నవాడు ఊరి మీద బ్రతుకుతాడు.
- ఊరికే వస్తే మా వాడు ఇంకొకడున్నడున్నాడు అన్నట్లు.
- ఎవడు తవ్వుకున్న గోతిలో వాడే పడతాడు.
- ఏటి వంకలు ఎవరు తీరుస్తారు?
- ఒళ్లు వంగని వారికి ఊరు అచ్చిరాదు.
- కంచె లేని చేను కన్నతల్లి లేని బిడ్డ ఒకటే.
- గంగిగోవు పాలు గరిటెడైనా చాలు.

– బాలచెలిమి

# నిజాయితీకి పరీక్ష



ఒక రోజు ఉదయం తెలుగు ఉపాధ్యాయురాలు తొమ్మిదవ తరగతికి వచ్చింది. పిల్లలందరూ మనకు ఇప్పుడు గణితం పీరియడ్ కదా అని మాట్లాడుకుంటున్నారు. అప్పుడు ఉపాధ్యాయురాలు “ఈ రోజు మీ అందరికీ పరీక్ష పెడతాను” అని చెప్పగానే తరగతిలో వున్నపిల్లలందరూ కంగారు పడతారు. టీచర్ మనకి పరీక్ష పెడతాను అని చదువు కొమ్మని చెప్పకుండా పరీక్ష వుంది అని చెప్తుంది అని అనుకుంటుండగానే టీచర్ తొందర తొందరగా బోర్డు పై ప్రశ్నలు రాయడం మొదలు పెట్టింది. అందరు ఎలా రాయాలి అని కంగారు పడుతునే ఇక చేసేది ఏమి లేక మనకు వచ్చింది రాద్దాం అని అందరూ పేపర్ తీసుకుని ప్రశ్నలు రాయడం మొదలు పెట్టారు. కానీ టీచర్ బోర్డు పై రాసే ప్రశ్నలు వాళ్ళ తెలివికి పరీక్ష అని వాళ్లకి అర్థం కావట్లేదు. ఇలా తెలియని పాఠాల నుంచి ప్రశ్నలు ఇస్తే రాస్తామో లేదో అని కావాలని టీచర్ ఇచ్చింది అని మాట్లాడుకుంటున్నారు. ఆ ప్రశ్నలు బాగా చదివేవారు కూడా రాయలేనంత కఠినంగా ఉన్నాయి. కానీ వాళ్లందరికీ అప్పుడే ఒక మంచి అవకాశం దొరికింది. ప్రిన్సిపాల్ దగ్గరనుండి టీచర్‌కి ఫోన్ వచ్చింది. అప్పుడు టీచర్ అందరితో నాకు ఒక చిన్న పని ఉంది మీరు నిశ్శబ్దంగా వ్రాయండి. అందరూ దూరం దూరంగా కూర్చొని పరీక్ష రాయండి. ఎవ్వరూ చూసి రాయకూడదు అని గట్టిగా చెప్పి టీచర్ వెళ్లిపోయింది. తరగతిలో వున్నవాళ్లందరికీ ప్రశ్నలకు జవాబులు తెలియదు కాబట్టి అందరూ మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆశతో అందరూ పుస్తకాలు తీసి జవాబులు చూసి రాయడం మొదలు పెట్టారు. కానీ, ఒక అక్షయ అనే అమ్మాయి తప్ప అందరికందరూ చూసి రాశారు. అక్షయ ఒక్కతే పుస్తకం చూడకుండా తనకు వచ్చింది రాసింది. ఈ లోపు టీచర్ రానే వచ్చింది. అందరు ఏమీ తెలియనట్టు పరీక్ష రాసి కూర్చున్నారు. టీచర్ అందరి పేపర్లు తీసుకుంది. మరుసటి రోజు టీచర్ మార్కులు చెప్పడానికి వచ్చింది. ఒక అక్షయ తప్ప అందరూ పరీక్షలో విఫలం అయ్యారు అని టీచర్ చెప్పింది. తరగతిలో వున్నవాళ్లందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. మనం అందరం ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసాము కదా కానీ అక్షయ ఒక్కతే పాస్ ఎలా అయింది మనము ఎందుకు పాస్ కాలేదు. అని ఒకరికొకరు గుస గుసలాడుతున్నారు. అప్పుడు టీచర్ అంటుంది. ఇక్కడ విషయం ఏంటంటే 90% మీకు నేను ఇచ్చిన ప్రశ్నల్లో మీరు చెప్పని పాఠాల నుంచి ఇచ్చాను. అసలు ఇది మీ తెలివికి మీ నిజాయితీకి పెట్టిన పరీక్ష. అక్షయ ఒక్కతే నిజాయితీగా పరీక్ష రాసింది. చెప్పు అక్షయ నువ్వు ఇలా ఎలా చేయగలిగావు అని టీచర్ అడిగింది. అప్పుడు అక్షయ ఇలా చెప్పింది. “నేను ఇప్పుడు ఎప్పుడూ ఒకటే నమ్ముతా టీచర్. అదేంటంటే... మనిషికి ధనం ముఖ్యం కాదు, మార్కులు ముఖ్యం కాదు మన నిజాయితే మనకు ముఖ్యం అని నమ్ముతా టీచర్.” అని అన్నది. ఇంకా టీచర్ చెప్పిన పద్యాలను గుర్తు చేస్తూ విద్యనే మనకు ధనం అన్నీ అంటుంది. టీచర్, అక్షయను మెచ్చుకుంటూ అందరికి నిజాయితీ యొక్క విలువను చెప్పింది. దాంతో పిల్లలందరూ తమ తప్పును తెలుసుకొని అప్పటి నుండి మంచిగా ఉంటూ టీచర్ దృష్టిలో మంచి పేరు తెచ్చుకున్నారు.

– జి. అక్షయ
9వ తరగతి, టి.జి.ఎం.ఎస్. రహీంఖాన్ పేట్
m : 7672073143

# పావురాల సంఘబలం



ఒక అడవిలో కొన్ని పావురాలు ఉండేవి. చిత్రగ్రీవం అనే పావురం వాటి రాజు. చిత్రగ్రీవం ఎప్పుడూ తన వారి సంక్షేమం కోసం పాటుపడేది. ఒక రోజు ఒక వేటగాడు ఆ అడవికి వచ్చి కొన్ని నూకలు నేలమీద చల్లి వాటిమీద వల పన్నాడు. పక్షులు ఎప్పుడు వాలతాయా అని దూరంగా నక్కి చూస్తున్నాడు. ఇంతలో చిత్రగ్రీవుడి పావురాల బృందం అక్కడికి ఎగురుతూ వచ్చింది. ఆ పావురాలు అక్కడ వాలి నూకలను తిందామని అన్నాయి. చిత్రగ్రీవం అడవిలో నేలపై నూకలు కనిపించడం విడ్డూరమని, దీనిలో ఏదో మోసం ఉందని వారించింది. కానీ మిగిలిన పావురాలు ఆ మాటలను పెడచెవిని పెట్టి, నూకలను తిందామని వాలి వలలో చిక్కుకున్నాయి. చిత్రగ్రీవం అది చూసి ఎంతో బాధ పడింది. చావైనా, బ్రతుకైనా తన పరివారంతోనే ఉండటం తన ధర్మం, అని తాను కూడా దిగి, వలలో చిక్కుకుంది. వలలో చిక్కుకున్న పావురాలు ఒకదానికొకటి నిందించుకోవడం మొదలుపెట్టాయి. అప్పుడు ధైర్యవంతుడైన ఆ చిత్రగ్రీవ, “కష్టాలు వచ్చినప్పుడే గుండెబలం కావాలి. సమస్యలు వచ్చినప్పుడు భయపడకూడదు. మనం అందరం కలిసికట్టుగా ఒకేసారి ఎగిరి, ఈ వలను మొత్తం ఎగరేసుకు పోదాం” అని మిగిలిన పావురాలతో చెప్పింది.

ఇంతలో దూరం నుంచి వేటగాడు వాటిని పట్టుకోవాలని రాసాగాడు. చిత్రగ్రీవం చెప్పినట్టుగా అన్ని పావురాలు కలిసి ఒక్కసారిగా పైకి ఎగిరాయి. వాటితో పాటు వలను కూడా ఎగరేసుకుపోసాగాయి. బోయవాడు దీనిని చూచి ఆశ్చర్యపోయాడు. అప్పుడు చిత్రగ్రీవం తన తోటి పావురాలతో “ఇక్కడికి దగ్గరలో నా ప్రియమిత్రుడైన హిరణ్యకుడు అనే ఎలుకల రాజు ఉన్నాడు. మనం అతని వద్దకు వెళితే అతడు ఈ వలను కొరికి మనలను విడిపిస్తాడు” అని చెప్పింది. పావురాలు వలతో సహా హిరణ్యకుడు నివసించే బిలం ముందు వాలాయి. హిరణ్యకుడు చిత్రగ్రీవుని గొంతు విని బయటకు వచ్చింది. తన స్నేహితుడు వలలో చిక్కుకుని ఉండడం చూసి, “నువ్వు నా ప్రాణమిత్రుడివి, కనుక మొదట నీ బంధనాలను కొరుకుతాను. తర్వాత నీ మిత్రులను విడిపిస్తాను” అంది. కానీ చిత్రగ్రీవం తన స్వార్థాన్ని చూసుకోకుండా, “కాదు కాదు! వీళ్ళంతా నాకు అత్యంత ఆప్తులు. ముందుగా వీరిని విడిపించు. అప్పుడే నాకు తృప్తి కలుగుతుంది” అని చెప్పింది.

హిరణ్యకుడు చిత్రగ్రీవం యొక్క ధర్మగుణానికి ఎంతో సంతోషించి, తన మూషిక సైన్యాన్ని పిలిచాడు.

**నీతి : కలసికట్టుగా ఉంటే చెయ్యలేని పని లేదు. తెలివిగల మిత్రుణ్ణి మించిన వరం లేదు.**

సేకరణ : అమరావతి



## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# నేలకొండపల్లి - బౌద్ధస్థూపం

తెలుగు నేలపై ఇప్పటి వరకు బౌద్ధ ధమ్మ వ్యాప్తికి కారణమైన కట్టడాలు, స్థూపాలు, విహారాలు తదితర ఆనవాళ్ళు సుమారుగా 280కి పైగా బౌద్ధ స్థలాలు బయటపడ్డాయి. క్రీ.పూ. 3వ శతాబ్ది నుంచి క్రీ.శ. 8వ శతాబ్ధం వరకు బౌద్ధ పరిమళాలు వెదజల్లిన ఈ నేల కాలక్రమేణా కార్యకారణాలు ఏవైనా, బౌద్ధ స్థలాలు వాటి అస్థిత్వాన్ని కోల్పోయి నిరాదరణకు గురికావడం జరిగింది. స్థూపాలు, చైత్యాలు, ఆరామాలు, విహారాలు, కట్టడాలు, శిల్పాలు వాటి ఆనవాళ్ళను కోల్పోయి, శిల్పాలు కూడా చాలా ప్రదేశాలకు తరలించబడ్డాయి. అప్పటి ప్రదేశాల పేర్లు మారాయి. స్థూపాలను దిబ్బలన్నారు. గద్దెలన్నారు. ఈ ఉదంతానికి నిలువెత్తు సాక్ష్యం నేలకొండపల్లి. ఈ పేరులోనే ఒక ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా ఊర్లకు వ్యక్తుల పేర్లు గాని, ఏదైనా ఒక కారణం, లేదా సందర్భం, లేదా ఇతరత్రా పేర్లను మనం చూస్తుంటాం. కాని ప్రకృతిలోని పంచభూతాలలో నేల ఆకాశాన్ని కలిపినట్లుండే (నేలకొండ) పేరు కలిగిన నేలకొండపల్లి గ్రామంలో బౌద్ధ స్థూపం నేలకొండపల్లి నుండి ముజ్జుగూడెం పోయేదారిలో, ఖమ్మం జిల్లా కేంద్రానికి 20 కి.మీ. కోదాడ పట్టణానికి 19 కి.మీ. దూరంలో, నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉంది. స్థానికులు ఈ మట్టిదిబ్బను నేలకొండ, ఎర్రదిబ్బ అని, విరాటరాజు గద్దె అని పిలిచేవారు. 1976లో రాష్ట్ర పురావస్తు శాఖ వరంగల్ ఆఫీస్‌లో పని చేసిన బండారు సుబ్రమణ్యం, ఎన్నార్వీ ప్రసాద్‌లు స్థానికుల సమాచారం, పై అధికారుల ఆదేశంతో అక్కడ పరిశీలన చేసి ఇది మట్టి దిబ్బ, విరాటరాజు గద్దె కూడా కాదు. బౌద్ధ స్థూపం అని తేల్చారు. పురావస్తుశాఖ అప్పటి సంచాలకులు వి.వి. క్రిష్ణశాస్త్రి చొరవతో ఆ సంవత్సరమే కొద్దిపాటి త్రవ్వకాలు జరిగాయి. తరువాత వరుసగా 15 ఏళ్ళ పాటు శాస్త్రీయ పద్ధతిలో త్రవ్వకాలు జరిగి ఈ చారిత్రక బౌద్ధ స్థావరం చరిత్ర కట్టడాలు, శిల్పాలు వెలుగులోనికి వచ్చాయి. క్రీ.పూ. 1వ శతాబ్ధం - క్రీ.శ. 1వ శతాబ్దాల మధ్య శాతవాహనుల కాలంలో కట్టిన ఈ స్థూపానికి కుడివైపున ఉన్న రాతి గుట్టను బైరాగుల గుట్ట అని పిలుస్తారు. ఈ గుట్టపైన చిన్న స్థూపం, విహారాలు, ఆనాటి బౌద్ధ బిక్షువుల నివాస ఆనవాళ్ళు బయల్పడినవి. ఈ గుట్ట దిగువన విశాలమైన ప్రాంతంలో జరిపిన త్రవ్వకాల్లో ఒక సున్నప్పు తొట్టి, సున్నపురాతి శిలాఫలకాలు అనేక విహారాలు, గుట్ట దగ్గరలో గల గార్లదిన్నె వద్ద 1977లో ఊరివాళ్ళు నేలను చదును చేస్తూ మట్టి త్రవ్వుచుండగా, అత్యంత అద్భుత బుద్ధుని మహాపురుష లక్షణాలు కలిగిన 9 సున్నపు రాతి బుద్ధుని విగ్రహాలు, ఇంకా శాతవాహన, ఇక్ష్వాకుల (చాంతమూలుని) నాణేలు, మట్టితో చేసిన త్రిరత్న చిహ్నాలు బయటపడ్డాయి. ఇక్కడ ప్రత్యేకంగా మహా స్థూపం, విహారాలు, అలాగే స్థూపంతో కలుపుకుని 200 అడుగుల వ్యాసం గల మొదటి ప్రదక్షణాపథం, దానిపైన 150 అడుగుల వ్యాసంతో రెండవ ప్రదక్షణాపథం, స్థూపం సుమారు 50కి పైగా అడుగుల ఎత్తు కలిగి ఉండటం దక్షిణ భారత దేశంలో అతిపెద్ద స్థూపంగా తెలుగు వారంతా గర్వించదగ్గ స్థూపం నేడు తెలంగాణ రాష్ట్రంలో ఉండటం ఒక ప్రత్యేకత. స్థూపం పునాదిలోని ఇటుకలు 22×9×3 అంగుళాలు గలవి. శాతవాహన కాలానికి, వేదిక బయట వాడిన ఇటుకలు 18×9×3 అంగుళాలు, ఇక్ష్వాకుల కాలానికి 12×12×3 అంగుళాలవి. విష్ణుకుండినుల కాలం వరకు నిర్మాణాలు మరమ్మతులు జరిగాయని, ఇక్కడ విహారాలు నిర్మించారని, బౌద్ధ బిక్షువులకు దానాలు చేసినట్లు తుమ్మలగూడెం, హైదరాబాద్ మూసీ ఒడ్డున గల చైతన్యపురి శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇక విష్ణు కుండినుల కాలపు పంచలోహ అవలోకితేశ్వర పద్మపాణి విగ్రహం 25 సం.రాల క్రితం స్థానిక కత్తువ వాగులో జాలరికి దొరికిన దానిని పురావస్తు శాఖ హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లోని స్టేట్ మ్యూజియానికి తరలించారు. అలాగే ఇక్కడ దొరికిన తొమ్మిది సున్నపు పాలరాతి బుద్ధుని విగ్రహాలు స్థూప ఫలకం, బౌద్ధపీఠం, టెర్రకోట వస్తువులు, మొ॥ మద్రాసు మ్యూజియం, సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లా ఆర్కియాలాజికల్, విజయవాడ, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ పురావస్తు మ్యూజియాలలో నేడు మనం చూడవచ్చును. అంతే కాకుండా నేలకొంపల్లి ప్రముఖ పట్టణంగా, బౌద్ధ శిల్పాల తయారీ కేంద్రంగా, మచిలీపట్నం ఓడరేవు నుంచి ప్రపంచ దేశాలకు ఇక్కడి శిల్పాలు ఎగుమతి జరిగినట్లుగా చరిత్రకారుల అభిప్రాయం. ఇంత చారిత్రక నేపథ్యం గల నేలకొండపల్లి శాతవాహనుల కాలంలో థేరవాదం, ఇక్షాకుల కాలంలో మహాయానం, విష్ణుకుండినుల కాలంలో వజ్రాయాన బౌద్ధ కేంద్రంగా విలసిల్లినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# వెండి బాతు గుడ్డు

"బంగారు గుడ్లు పెట్టే బాతు కథ మనకందరికీ తెలిసిందే. అటువంటి గుడ్లు పెట్టే బాతులు కథలలో తప్ప ఉండవు. కాని వెండి గుడ్డు పెట్టే బాతులు ఉన్నాయి. నేను స్వయంగా చూశాను," అని సూర్యం బాబయ్య చెబుతూ ఉంటే పిల్లలంతా మొగ మొగాలు చూసుకున్నారు. వాళ్లకి నమ్మకం కలగడం లేదు. "అలాంటి బాతు ఉంటే చూపించు," అని సవాలు చేశాడు హేమంత్. "ఆ బాతు ప్రస్తుతం ఇక్కడ లేదు. కానీ, అది పెట్టిన వెండి గుడ్డు ఒకటి ఉంది. చూస్తారా?" అన్నాడు సూర్యం.

సూర్యం బాబయ్య కళ్లల్లోని మెరుపు ఆ పిల్లలందరికీ బాగా పరిచయమైందే. ఇందులో ఏదో మోసం ఉంది అని అనుమానిస్తూనే వెండి బాతు గుడ్డు ఎలా ఉంటుందో చూద్దామని పిల్లలంతా ఉత్సాహపడ్డారు. సూర్యం వాళ్లని ఒక గదిలోకి తీసుకువెళ్లాడు. అక్కడ బల్లమీద ఒక గాజు జగ్గు, దాని నిండా నీళ్లు, ఆ నీళ్లల్లో అడుగున ధగా ధగా మెరుస్తూన్న వెండి బాతు గుడ్డు కనిపించాయి! "అది వెండిలా మెరుస్తోంది కానీ, వెండిది కాదు. వెండి రంగు పూసి ఉంటావు," అన్నాడు హేమంత్ ఆశ్చర్యం నుంచి తేరుకుని. "వెండి రంగు పూశానని అంటావా? అంత అనుమానమైతే ఆ గుడ్డును బయటకి తీసి చూడు," అన్నాడు సూర్యం.

హేమంత్ ఆ నీళ్లల్లో చెయ్యి పెట్టి గుడ్డును బయటకి తీశాడు. దాన్ని చూసి, పిల్లలంతా మరోసారి ఆశ్చర్యపడ్డారు. ఆ గుడ్డు వాళ్లు ఊహించుకున్నట్లు వెండిరంగులో లేదు. నల్లని బొగ్గు రంగులో ఉంది! ఇంతకు ముందు నీళ్లల్లో తళతళా మెరిసిపోయిన గుడ్డు ఈ కారు నల్లనిదేనా అని నమ్మలేనట్లు చూశారు పిల్లలు.

హేమంత్ ఆ గుడ్డును చేతితో తుడిచేసరికి చేతి నిండా మసి అంటుకుంది. మామూలు తెల్లని గుడ్డు బయటపడింది. పిల్లలకి ఈ గారడీ బాగా నచ్చినట్లు వాళ్ల మొహాలే చెబుతున్నాయి. దానిని ఎలా తయారు చేశాడో సూర్యం బాబయ్య వివరించాడు.



కొవ్వొత్తి వెలిగించి, దాని నుంచి వస్తున్న మసిలో మామూలు గుడ్డును పెట్టి, ఆ గుడ్డుకి అన్ని వైపులా మసి పట్టుకునేటట్లు తిప్పుతూ ఉంటే కొద్ది సేపట్లోనే తెల్లని గుడ్డు నల్లగా మారుతుంది. మసి బారిన ఈ గుడ్డును జగ్గులోని నీళ్లల్లో పెడితే చాలు తళతళా మెరుస్తూ వెండి గుడ్డులా కనిపిస్తుంది. "నల్లని గుడ్డు నీళ్లల్లో విడవగానే వెండి లాగా ఎందుకు మెరుస్తుంది?" అని హేమంత్ సందేహం. కారణం వివరించాడు సూర్యం.

మసి అంటే సూక్ష్మాతి సూక్ష్మమైన బొగ్గు కణాలన్నమాట. ఈ బొగ్గు కణాలకు తడి అంటుకోదు. నీళ్లకీ ఈ బొగ్గు రేణువులకీ మధ్య బహు పలుచని గాలి పొర మిగిలిపోతుంది. ఈ గాలి పొర అద్దం లాగా వెలుతురును ప్రతిఫలించి, వెండి లాగా మెరుస్తూ కనిపిస్తుంది. "నీళ్లల్లో నుంచి చూడగలవా?" అనే ప్రయోగంలో వివరించిన "పూర్ణ ఆంతరిక పరావర్తనం" అనే ప్రక్రియే ఇక్కడ పని చేస్తుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

లఘు నాటిక




# ఎవరు గొప్ప?

పాత్రలు: హేమ-టీచర్, తరుణ్-లిఖిత్ స్నేహితుడు
లిఖిత్-విద్యార్థి, సాకేత్-లిఖిత్ స్నేహితుడు, చందన-లిఖిత్ అక్క

### దృశ్యం - 1

హేమ : లిఖిత్ ఏం చేస్తున్నారు?

లిఖిత్ : టీచర్ సెలవుల్లో కొత్త విషయాలు తెలుసుకుని ఏదైనా చేసి చూపించాలని అన్నారు కదా!

హేమ : అవును

సాకేత్ : ఐడియా వస్తలేదు టీచర్!

తరుణ్ : ఎంత ఆలోచించినా ఏం చేయాల్నో తెలుస్తలేదు టీచర్!

లిఖిత్ : నీకు దిమాక్ లేదని టీచర్ కి తెలుసులేరా

చందన : అలా మాట్లాడకూడదు లిఖిత్

హేమ : అవును మీ అక్క కరెక్ట్‌గా చెప్పింది.

లిఖిత్ : సారీ టీచర్

హేమ : సరే నేను సహాయం చేస్తాను మీరు నేను చెప్పినట్లు వింటారా.. కాదు కాదు చేస్తారా?

లిఖిత్, తరుణ్, సాకేత్ : ఓ చేస్తాం టీచర్

చందన: టీచర్ నేను కూడా వీళ్ళతో ఉండొచ్చా?

హేమ : తప్పకుండా మీరంతా శనివారం ఆట విడుపు సమయంలో నేను చెప్పింది చేసి చూపించాలి సరేనా? నేను కూడా మీతోనే ఉంటా కలిసి చేద్దాం

అందరూ: భలే భలే! సరే టీచర్

*(అందరూ టీచర్ చుట్టూ మూగుతారు. టీచర్ వారికి చెబుతుంది)*

### దృశ్యం -2

(బడి వేదిక పై లిఖిత్,చందన,తరుణ్,సాకేత్ నిలబడతారు. హేమ టీచర్ పర్యవేక్షకురాలిగా కుర్చీలో పక్కన కూర్చుంటారు. అందరూ ఒకే రంగు దుస్తులు వేసుకుంటారు. ఒక్కొక్కరు ప్లే

కార్డ్స్ పట్టుకుంటారు. వాటి మీద N, E, W, S అక్షరాలు పెద్దగా పెయింట్ చేసి ఉంటాయి)

హేమ : పిల్లలు మీ దగ్గరికి ఈరోజు ఈ నలుగురు పిల్లలు వచ్చారు వాళ్ళు ఏం చెబుతున్నారో వినండి.

లిఖిత్ : హలో హలో నేనండి నేను ఉత్తరం దిక్కుని నార్త్ అంటారు చూశారా అక్షరం N అంటే నార్త్ అన్నమాట! మీరంతా నిటారుగా నిలబడి నన్ను చూస్తారు.

సాకేత్ : అగుబై అందరికీ నమస్తే. నేనండి తూర్పు దిక్కుని మీరు నా వైపు తిరిగి నమస్కారం చేస్తారు తెలుసు కదా! E అంటే ఈస్ట్ అన్నమాట!

తరుణ్ : ఉండవోయ్ హలో హలో నేనండీ పడమర దిక్కుని మీరు గమనించారా W అంటే వెస్ట్ ఓ తూర్పు సారూ మీరు నా ఎదురుగానే ఉండేది.! ఒక పాట కూడా యాదికొస్తుంది తూర్పు పడమర ఎదురెదురు అని

చందన : అబ్బ ఆపండి మీ గోల! అసలే నా వైపు బరువు పెట్టి పెట్టి నేను బరువెక్కి పోయాను నేను దక్షిణ దిక్కుని! S అందమైన ఎస్ అక్షరం నా పేరు మీదే!

లిఖిత్: నేను ఎంత గొప్ప వాడినో తెలుసా నా వైపు హిమాలయ పర్వతాలు ఉన్నాయి తాజ్ మహల్ కట్టడం ఉంది కోటలు, పింక్ సిటీ, గంగా నదులు, థార్ ఎడారి... ఎన్నో ఎన్నెన్నో!

(స్టైల్‌గా ఎదురు నిలబడతాడు )

సాకేత్ : మరి నా వైపు ఏమన్నా తక్కువా? అసలు సూర్యోదయం నా వైపే అందరూ నా వైపు సూర్యుని చూసి దండం పెట్టుకుంటారు. ప్రకృతి సౌందర్యం అంతా నా వైపే ఉంది.

తరుణ్ : పోదురు బడాయి నేనేమన్నా తక్కువ వాడినా? ఏయ్ తూర్పు బడాయి నీ వైపు ఉదయిస్తే నా వైపు సూర్యుడు అస్తమిస్తాడు ఆ సంగతి తెలుసా నీకు? పితృదేవతలను విశ్రాంతి తీసుకునే చోటు నాది. అయినా నన్ను సరిగా చూసుకుంటే ధనం లాభం అన్ని ఉంటాయంట ఆ సంగతి తెలుసా?

చందన : ఎవరిది! నన్ను మర్చిపోయిన ట్లున్నారు నా వైపు తిరిగే కాలాన్ని 'దక్షిణాయనం' అంటారు నా దిక్కు శక్తి కేంద్రం యముడి దిక్కువా అని కూడా అంటారు పైగా ద్రాక్షారామం, దక్షిణ కాశీ ఇలాంటి పేర్లు ఎన్నో ఉన్నాయి ఎన్నో పుణ్య క్షేత్రాలు కూడా నా వైపే ఉన్నాయి మీకు ఆ సంగతి తెలుసా ఇంతకీ?

హేమ : అదిగో అదిగో దిక్కులు అలా గోల చేయకండి అందుకే ఎవరైనా గట్టిగా మాట్లాడితే దిక్కులు పిక్కటిల్లే లాగా మాట్లాడుతారు అంటారు.

లిఖిత్ : అమ్మ మీరు చెప్పండి మాలో ఎవరు గొప్పో?

సాకేత్ : అవునమ్మా నేనే గొప్ప అని చెప్పండి

తరుణ్ : కాదు కాదు కాదు కాదు నేనని చెప్తారు కదా

చందన : వీరెవరు కాదు అమ్మా మీరు చెప్పండి నేనే అని!

హేమ : చూడండి మీలో ఏ ఒక్కరూ తక్కువ కాదు మీకు తోడు దిక్పాలకులు ఉన్నారు తెలుసా? అవి ఈశాన్యం, ఆగ్నేయం, వాయువ్యం,నైరుతి. వీటిని కలిపితే అష్టదిక్కులు అని కూడా అంటారు.

లిఖిత్ : నేను గొప్ప కాదా? పాట పాడాల్నా.. ఉత్తరాన ఊరు అవుతల ఒకచోట ఉన్నది తెలుసా?

సాకేత్ : నేను గొప్ప కదా? నాకు కూడా పాట వచ్చు తూరుపు సింధూరపు వెన్నెలలో ఉదయ రాగం..

తరుణ్ : నేనే కదా గొప్ప? నాకు రాదా పాట తూర్పు పడమర ఎదురెదురు నింగి నేల ఎదురెదురు కలియని దిక్కులు కలవవని తెలిసి ఆరాటం ఎందుకని?

చందన : నేనే గొప్ప! ఊరికి ఉత్తరానా దారికి దక్షిణాన

హేమ : స్టాప్ స్టాప్ ఆపండి మీ పాటలు... మీలో ఎవరూ తక్కువ కాదు అలాగే ఏ ఒక్కరు మాత్రమే ఎక్కువ కాదు. ఇలా రండి N E W S కలిపితే న్యూస్ అంటే నార్త్ ఉత్తరం వైపు నుంచి,ఈస్ట్ తూర్పు వైపు నుంచి, వెస్ట్ పడమర వైపు నుంచి, దక్షిణం వైపు నుంచి అన్ని దిక్కుల నుంచి తెలియజేసే సమాచారాన్ని వార్తలు "న్యూస్" అంటారు కనుక ఇందులో ఏ ఒక్క దిక్కు లేకపోయినా అది సంపూర్ణం కాదు అన్ని దిక్కులు కలిస్తేనే నార్త్ ఈస్ట్ వెస్ట్ సౌత్ అవుతుంది అర్థమైందా!

(నలుగురూ ఒకరి చేయి ఒకరు పట్టుకుంటారు)

కలిసి అంటారు :

దిక్కులం మేం దిక్కులంమేమంతా కలిసి కట్టుగా ఉంటాం.

- డా. సమ్మెట విజయ
m: 99898 20215



# కొంగ - నక్క

ఒక రోజు నక్కకు బాగా ఆకలి వేసింది. అడవిలో అటూ.... ఇటూ తిరుగుతూ ఉండగా పులి వేటాడి తిని వదిలేసిన కొంత మాంసం కనబడింది. ఆకలితో ఉన్న నక్క దానిని ఆదర... బాదరగా తినడంతో ఒక ఎముక దాని గొంతులో ఇరుక్కుంది. అప్పుడు నక్క ఎలా చేయాలి? అని ఆలోచిస్తూ దిగులుతో కూర్చుంది. అటుగా వెళ్తున్న కొంగను చూసి, కొంగ బావ...

కొంగ బావ బాగున్నావా? అబ్బ ఎన్ని రోజులైంది నిన్ను చూసి. నీ మంచి తనంతో అడవిలో ఎన్నో జంతువులకు సహాయం చేశావు.


ఇపుడు నాకు కూడా ఒక సహాయం చేయవా! అంటూ ప్రాధేయపడింది. ఏం సహాయం చేయాలి? ఏమి లేదు, చిన్న సహాయమే, నా గొంతులో ఎముక ఇరికింది. అది తీసి పుణ్యము కట్టుకోవ, అలా చేస్తే నాకేంటి లాభం. ఊరకే కాదులే మీకు మంచి బహుమానం ఇస్తాను. సరే ఇలా రా! అని నక్క గొంతులో ఇరికిన ఎముకను తీసేసింది. తరువాత కొంగ ఇపుడు నాకు ఇస్తానన్న బహుమానం ఇవ్వు అని అడుగగా, నక్క నవ్వుతూ నా సమస్య తీరడానికి అలా అన్నాను. ఇక నీ దారిన నీవు వెళ్ళు. బహుమానం లేదు. గిహుమానం లేదు. నవ్వుతూ అక్కడి నుండి మెల్లిగా జారుకుంది.

నీతి: చెడ్డ వాళ్లకు సహాయం చేస్తే వృథా ప్రయాసే, వారికి కృతజ్ఞత ఉండదు.

– లకావత్ సుజిత్ కుమార్
6వ తరగతి, జిపాఉపా, కులాస్ పూర్, మోపాల్, నిజామాబాద్.
m : 99631 30856

# ప్రాణాలకు తెగించి దేశభక్తిని చాటుకున్న న్యూక్లియర్ సైంటిస్ట్ డా. రాజా రామన్న

ప్రపంచవ్యాప్తంగా యుద్ధమేఘాలు దేశాలను కమ్ముకుంటున్నాయి. ఇరాన్ మీద అమెరికా చేస్తున్న దాడి అంతర్జాతీయంగా భయాన్ని కల్పిస్తోంది. దీనిలో ఇజ్రాయిల్ ఏ రకంగా అంతర్భాగమైందో కూడా తెలుసుకుంటే బోధపడుతుంది. దేశభక్తి అంటే జాతీయ పతాకం పట్టుకుని ఊరేగడం, దేశభక్తి గీతాలు ఆనందంగా పాడుకోవడం, గొప్ప గొప్పగా ప్రసంగాలు చేయడం మాత్రమే కాదు; కొన్ని సందర్భాలలో శాస్త్రవేత్తలు దేశభక్తిని ఏ రకంగా వ్యక్తపరుస్తారో తెలుసుకోవడం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. డాక్టర్ రాజా రామన్న (1925-2004) చాలా ప్రఖ్యాతి చెందిన భారతీయ న్యూక్లియర్ సైంటిస్ట్. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ మన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఆయన రక్షణ శాఖ సహాయ మంత్రిగా కూడా సేవలందించారు.



తెలుగు ప్రాంతానికి సరిహద్దులు ఉండే కన్నడ ప్రాంతమైన టిప్ టూర్‌లో రాజారామన్న 1925 జనవరి 28న జన్మించారు. మైసూరు, బెంగళూరు, మద్రాసు, బొంబాయిలలో చదివిన రాజా రామన్న 1949లో లండన్‌లోని కింగ్స్ కాలేజీ నుంచి న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పిహెచ్డి చేశారు. 1944లో హోమీ జహంగీర్ భాభాను కలిసి, స్ఫూర్తి పొందినారు కనుక, భారతదేశం తిరిగి వచ్చి 1949లో ఆయన దగ్గరే టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ఉద్యోగంలో చేరారు. 1952లో ఆయన ఇండియన్ న్యూక్లియర్ ప్రోగ్రాంలో భాగంగా బొంబాయిలోని భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. 1957లో తొలి న్యూక్లియర్ రియాక్టర్ 'అప్సర' ప్రాజెక్టులో పని చేశారు. అదే సంవత్సరం అక్కడే న్యూక్లియర్ ఫిజిక్స్‌లో శాస్త్రవేత్తలకు శిక్షణ ఇవ్వడానికి ఒక కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ మరుసటి సంవత్సరం అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ కోరిక మేర ఆయుధాల తయారీకి పనికి వచ్చే ప్లూటోనియం ప్రాజెక్టులో కూడా పని చేశారు. బి.ఏ.ఆర్.సి. డైరెక్టర్, ఇండియన్ అకాడమీ సైన్సెస్ వైస్ ప్రెసిడెంట్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అధ్యక్షులు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రక్షణ శాఖ కార్యదర్శి, రక్షణ శాఖ సలహాదారు, డిఆర్డీఓ డైరెక్టర్ జనరల్, అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు... వంటివి ఆయన తన జీవితకాలంలో నిర్వహించిన పలు రకాల బాధ్యతలు.

1974 మార్చి మే 18న 'స్మైలింగ్ బుద్ధ' పేరున భారతదేశం తొలి న్యూక్లియర్ ఆయుధాల పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో డా. రాజారామన్న కీలకపాత్ర వహించారు. ఆ సమయంలో ఆయన భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. మన దేశం రహస్యంగా ఈ అణుపరీక్షలను విజయవంతంగా నిర్వహించినా; ప్రముఖ శాస్త్రవేత్తలు ఎవరో, ఏమిటో ప్రపంచానికి సులువుగానే తెలుస్తుంది. 1978లో ఇరాక్ ఉపాధ్యక్షుడు, ఆ దేశ ప్రముఖ నాయకుడు డాక్టర్ రాజా రామన్నకు ఆహ్వానం పంపి తమ దేశాన్ని పర్యటించమని కోరారు. ఒక వారం పాటు పర్యటన కోసం రాజారామన్న ఇరాక్ వెళ్ళినప్పుడు సద్దాం హుస్సేన్ చాలా ఖరీదైన రీతిలో సదుపాయాలు కల్పించి, బాగ్దాద్ నగరాన్ని చూపించారు. తర్వాత ఫ్రెంచి, రష్యా దేశాల సహాయంతో టువైటా (Tuwaitha)లో తాము రూపొందిస్తున్న అణుపరీక్షల సన్నాహక కేంద్రాన్ని కూడా చూడటానికి తీసుకువెళ్లారు. ఇలా పర్యటిస్తున్న సమయంలో సద్దాం హుస్సేన్ ఎందుకు ఇరాక్ పూర్తిస్థాయి అణుపరీక్షలను నిర్వహించలేకపోతోంది, అదే సమయంలో భారతదేశం ఎలా విజయం సాధించింది అని చర్చించడానికి ప్రయత్నించేవాడు. అలా చర్చిస్తూ, మీరు మీ దేశానికి చేసిన సేవ చాలు... ఇకనుంచి ఇక్కడే ఉండిపోండి, భారతదేశం తిరిగిపోవద్దు.. మీకు ఏమి కావాలన్నా నేను ఏర్పాట్లు చేస్తాను, ఎంత కావాలన్నా ఇస్తాను... ఇక్కడ న్యూక్లియర్ పరీక్షల ప్రాజెక్టుకు నేతృత్వం వహించండి... అని శతవిధాల వేడుకున్నాడు. పర్యటనకు ఆహ్వానించడంలోని సద్దాం హుస్సేన్ ఉద్దేశాన్ని డా. రాజారామన్న జాగ్రత్తగా గమనించి, తన కుటుంబ కారణాలు రీత్యా తిరిగి వెళ్లక తప్పదు అని వివరించారు. ఇక అక్కడ ఉండటం ఎంత మాత్రమూ శ్రేయస్కరం కాదని, ఆ మరుసటి ఉదయమే భారతదేశం తిరిగి వచ్చేశాడు. అలా అక్కడికక్కడే తిరస్కరించి రావడమనేది ఎంత ప్రమాదమో మనం ఊహించవచ్చు. అలా మన దేశం కోసం ప్రాణాలను కూడా లెక్క చేయకుండా తిరిగి వచ్చిన డా. రాజారామన్న 2004లో మరణించేదాకా, భారత దేశపు అణ్వాస్త్రాలకు సంబంధించిన పరిశోధనలను పర్యవేక్షిస్తూ సేవలందించారు. వారి నేతృత్వంలో పని చేసిన వారిలో డా. ఏ.పీ.జే. అబ్దుల్ కలాం వంటి వారు కూడా ఉండటం విశేషం.

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392



# మందార చెట్టు


హాయ్ బాలలూ ఎలా ఉన్నారు? ఎండలు బాగా మండుతున్నయ్ కదా! ఆరోగ్యం జాగ్రత్త. మనం మార్చి నెల బాల చెలిమి సంచికలో చెట్టు – చేమ శీర్షికన బొప్పాయి చెట్టు గురించి తెలుసుకున్నాం కదా! ఈ ఏప్రిల్ నెల బాల చెలిమిలో "మందార" చెట్టు గురించి తెలుసుకుందాం సరేనా! మందార చెట్టు సహజ సిద్ధంగా అన్ని ప్రాంతాలలో కనిపించే పూల మొక్క. దీని కొమ్మను కట్ చేసి భూమిలో నాటితే కొద్ది రోజులకే ఇగురు వచ్చి మొక్కగా పెరుగుతుంది. మందార చెట్టు యొక్క పువ్వులు చూడడానికి ఎరుపు, తెలుపు, పశుపు పచ్చ, లేత నీలం వంటి వివిధ రంగులలో అందంగా కనిపిస్థాయి. ముద్ద మందారం ఎరుపు రంగు కలిగిన మొక్కలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. మందార ఆకులు ఆకుపచ్చగా ఉండి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. చిన్నపాటి ఇంటి జాగలో కూడా దీన్ని పెంచుకుంటారు. ఆసియా, పసిఫిక్ దీవులలో ఉద్భవించిన మందార ప్రపంచవ్యాప్తంగా ఉష్ణ మండలంలో సహజంగా పెరిగే మొక్క జాతి చెట్టు. దీని యొక్క శాస్త్రీయ నామం 'హైబిస్కస్ రోసా సైనేన్సిస్'. మందార "అనేది మాల్వేసి" కుటుంబానికి చెందిన మొక్క. దీన్ని చెట్టు అనడం కంటే మొక్కగానే ఎక్కువగా పిలుస్తారు. మందార చెట్టు ఆకులను, పువ్వులను వందల సంవత్సరాలుగా సాంప్రదాయ వైద్యంలో ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు ఆరోగ్య పరిశోధనలో చాలా విరివిగా వాడుతున్నారు. వివిధ అధ్యయనాల ప్రకారం గుండె, మూత్రపిండాలు, మరియు కాలేయానికి మందార చెట్టు ఎంతో ప్రయోజనకారిగా పరిశోధకులు భావిస్తున్నారు. దీన్ని ఆంగ్లంలో 'చైనా రోస్' అంటారు. మందారను హిందీలో "గుదల్ లేదా జస్వంత్" అని కూడా పిలుస్తారు. మందార పుష్పాన్ని హవాయి, మలేషియా వంటి దేశాలు జాతీయ పుష్పంగా ప్రకటించాయి. అయితే మందార చెట్టు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని తెలుసుకుందాం.


**మందార చెట్టు యొక్క ప్రయోజనాలు:**

- మందార పువ్వులు, ఆకులను శిరోజాల సౌందర్య పోషణలో బాగా ఉపయోగిస్తారు.
- మందార పూలను పసిఫిక్ ద్వీపాలలో సలాడ్ లో వేసుకుని తింటారు.
- ఈ చెట్టు యొక్క పూలను భారతదేశంలో పూజా కార్యక్రమంలోనూ ఉపయోగిస్తారు. స్త్రీలు తలలో పెట్టుకోవడం కూడా జరుగుతుంది.
- మందార పువ్వుల టీని తాగడం వల్ల బిపి తగ్గుతుంది.
- మందార ఆయిల్ సారంలో విటమిన్ సి అధికంగా కలిగి ఉండి జుట్టును రాలకుండా, నిగనిగ లాడే విధంగా నల్లగా ఉంచుతుంది.
- షాంపోల తయారీలోనూ మందారం బాగా ఉపయోగిస్తారు.
- మందారం మొక్క రక్తపోటును తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని రక్షించడంలో బాగా ఉపయోగపడుతుంది.
- మధుమేహం, క్యాన్సర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధుల నివారణకు మందారను బాగా ఉపయోగిస్తారు.
- జీర్ణ సమస్యలను తగ్గించడమే కాకుండా చర్మ ఆరోగ్యానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

బాలలూ! తెలుసుకున్నారు కదా! మందార చెట్టు యొక్క ప్రయోజనాలు. ఇంకెందుకు ఆలస్యం? ఆరోగ్యపరంగా, పర్యావరణపరంగా ఎన్నో ప్రయోజనాలు కలిగిన మందార మొక్కను మనం కూడా ఇంటి స్థలములో, పాఠశాల ఆవరణలో వెంటనే పెంచుకుందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


లక్ష్య సాధన
విన్న కథకు అక్షరీకరణ :
జుగాష్‌విలి
బొమ్మలు:
గోపి : తాతయ్యా! ఒక కథ చెప్పవూ!
తాత : అలాగే గోపీ! అనగనగా ఒక రాజు. రాజుకి పిల్లలు లేరు. రాజ్యాన్ని పాలించే వారసుడు లేడని దిగులు. ఒక రోజు మంత్రితో రాజు ఇలా అన్నాడు.
రాజు : మంత్రి! నాకు వృద్ధాప్యం వస్తుంది. నాకు వారసులు లేరు. నా తర్వాత రాజెవరు? పరిష్కారం చెప్పు.
తాత : రాజా! ఇంతకు ముందు నేను చెప్పిన సలహాలు ఏవీ మీకు నచ్చలేదు కదా. మనకు దగ్గర్లో ఒక స్వామీజీ ఉన్నాడు. వారేమైనా చెప్పగలరేమో ప్రయత్నిద్దామా!
రాజు : స్వామీ! నాకు పిల్లలు లేరు. నా తర్వాత రాజ్యాన్ని పాలించే వారసుడు లేడు. పరిష్కారం చెప్పండి స్వామీ!
స్వామి : రాజా! రేపు సూర్యాస్తమయ వేళకి మీ ముందుకు ఎవరు వస్తారో అతడినే రాజుగా ప్రకటించండి. అలా దండోరా వేయించండి.
మంత్రి : స్వామీ! ఇలా అయితే వందలు, వేల మంది వస్తారు కదా!
స్వామి :
(చిరునవ్వు నవ్వి మంత్రిని బయటికి పంపి రాజు చెవిలో ఏదో చెప్తాడు)
రాజు : మంత్రీ! రేపు సూర్యాస్తమయానికి రాజు ముందుకు ఎవరు వస్తారో అతడే రాజు అని దండోర వేయించండి.
మంత్రి : అలాగే రాజా! కానీ....


రాజు : మంత్రీ! ఏం కాదులే కాని... రేపు ఉదయం నుంచి రాత్రి వరకు ఆనందాల జాతర కూడా దండోరా వేయించండి. ఉదయం నుంచి రాత్రి దాకా అందరూ ఎంతైనా తాగొచ్చు. తినొచ్చు. నృత్యాలతో, జూదాలతో, క్రీడా విన్యాసాలతో కావాల్సినంత ఆనందంగా గడపొచ్చు. అంతా ఉచితమే అని ప్రకటించండి.
మంత్రి : అలాగే రాజా!...
ఆ మరుసటి రోజు రాజ్యంలోని ప్రజలంతా తాగుతూ, తింటూ, డ్యాన్సులు ఆడుతూ, పాడుతూ, జూదమాడుతూ ఉచితంగా వచ్చిన ఆనందాలతో తేలిపోతున్నారు.
యువకుడు : మహారాజా! మీరు ప్రకటించినట్లుగా సూర్యాస్తమయానికి నేను వచ్చాను. మీరిచ్చిన మాట నిలబెట్టుకుంటారా!
రాజు : నువ్వే నా వారసుడివి. నా తర్వాత రాజువు నువ్వే!
మంత్రి : రాజా! ఇతని గురించి ఏమీ తెలియదు కదా!...
రాజు : ఇతనే తగినవాడు. రాజ్యంలోని ప్రజలంతా రాజయ్యే అవకాశాన్ని వదిలిపెట్టి ఉచితమనగానే ప్రలోభాలకు లొంగి అవకాశాన్ని ఎలా పోగొట్టుకున్నారో చూసావుగా! ఇతను రాజవ్వాలనే లక్ష్యాన్ని విడిచిపెట్టలేదు. ఏ ప్రలోభాలకీ లొంగలేదు. ఏ ప్రలోభాలకీ లొంగనివాడే రాజ్యాన్ని, ప్రజలను చక్కగా పాలించగలడు.
తాత : ఏరా, గోపీ, ఈ కథ నీకేం చెప్పింది?
గోపి : ప్రతి వ్యక్తీ తనకి తానే బాధ్యుడు. తను ఏ కావాలనుకుంటున్నాడో అదే లక్ష్యంగా కృషి చేయాలి.

స్పోర్ట్స్




# బ్యాటింగ్ బలం... బౌలింగ్ మెరుపు.. టీమిండియా గెలుపు...

టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ అద్భుత ప్రదర్శనతో మరోసారి చరిత్ర సృష్టించింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు మొదటి నుంచే ఒత్తిడికి లోనైంది. సెమీఫైనల్లో అద్భుతంగా రాణించిన ఫిన్ అలెన్ ఈ మ్యాచ్‌లో 7 బంతుల్లో 9 పరుగులు మాత్రమే చేసి అక్షర్ పటేల్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. వెంటనే రచిన్ రవీంద్ర (1), గ్లెన్ ఫిలిప్స్ (5), మార్క్ చాప్‌మన్ (3) త్వరగానే పెవిలియన్ చేరడంతో కివీస్ పరిస్థితి మరింత క్లిష్టమైంది. 47 పరుగులకే కీలక వికెట్లు కోల్పోయి న్యూజిలాండ్ ఒత్తిడిలో పడింది.

ఓపెనర్ టిమ్ సెఫర్ట్ దూకుడుగా ఆడుతూ కొంతసేపు భారత బౌలర్లకు సవాల్ విసిరాడు. అతడు 26 బంతుల్లో 52 పరుగులు చేసి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చే ప్రయత్నం చేశాడు. వరుణ్ చక్రవర్తి కీలక సమయంలో అతడిని ఔట్ చేయడంతో కివీస్ ఆశలు దాదాపుగా ముగిశాయి. 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్ 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అక్షర్ పటేల్ మూడు వికెట్లు పడగొట్టగా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ ఒక్కో వికెట్ సాధించారు. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కూడా మూడు కీలక క్యాచ్‌లు పట్టి జట్టు విజయానికి తోడ్పడ్డాడు.

సంజూ శాంసన్ 46 బంతుల్లో 89 పరుగులు, అభిషేక్ శర్మ 21 బంతుల్లో 52 పరుగులు, ఇషాన్ కిషన్ 25 బంతుల్లో 54 పరుగులు చేశారు. భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల – 255 పరుగులు చేసింది.

భారత్ టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను 2007లో మహేంద్రసింగ్ ధోనీ , 2024లో రోహిత్ శర్మ, 2026లో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో మూడోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంతో టీమిండియా మరోసారి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటింది.

## మహిళల టీ20లో కొత్త చరిత్ర.. 15 ఏళ్ల ఫ్యానీ రికార్డు...

రువాండా యువ బ్యాటర్ ఫ్యానీ ఉటాగుషిమానిండే మహిళల అంతర్జాతీయ టీ20లో చరిత్ర సృష్టించింది. నైజీరియాలో జరిగిన టోర్నీలో ఘానాపై 65 బంతుల్లో 17 ఫోర్లతో 111 పరుగులు చేసి శతకం నమోదు చేసింది.

కేవలం 15 సంవత్సరాలు 223 రోజుల్లోనే ఈ ఘనత సాధించి అతి పిన్న వయసులో శతకం చేసిన క్రికెటర్‌గా



నిలిచింది. దీంతో ప్రోస్కోవియా అలకో రికార్డును అధిగమించింది.

మొదటి మ్యాచ్‌లోనే శతకం సాధించడం మరో విశేషం. రువాండా 20 ఓవర్లలో 210 పరుగులు చేయగా, ఘానా 88 పరుగులకే పరిమితమైంది. అద్భుత ఇన్నింగ్స్‌తో ఫ్యానీ మ్యాచ్ ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది.

– బాలచెలిమి డెస్క్

కథ

# దురాశపరులు



సుబ్బయ్య చిల్లరకొట్టు వ్యాపారంతో బాటు, మేకలను కూడా పెంచేవాడు. అతని భార్యకు నగల పిచ్చి, చీరల పిచ్చీనూ. ఆవిడ కోసం మేకలు అమ్మగా వచ్చిన డబ్బు మాత్రమే సుబ్బయ్య ఉపయోగించేవాడు. ఇలా ఉండగా ఏదో పండగ దగ్గర పడింది. సుబ్బయ్య భార్యకు చీర కొనవలసి వచ్చింది. సుబ్బయ్య ఒక మేకను అమ్మటానికి పొరుగూరు సంతకు తీసుకువెళ్లాడు. అతను డబ్బు వ్యవహారాలలో ఇతరులను ఏమాత్రం నమ్మడు. సంతరోజు అనుకోకుండా పెద్ద వర్షం పడడం వల్ల జనం పలుచగా ఉన్నారు. క్రయవిక్రయాలు తక్కువగా ఉన్నాయి. సుబ్బయ్య మేకకు 5 రూపాయల ధర కూడా పలక లేదు. 10 రూపాయలకు తక్కువైతే అమ్మే ఉద్దేశం లేక, రాత్రయ్యే వరకు మంచి బేరం కోసం ఎదురుచూసి, చివరకు మేకను తీసుకుని నిరుత్సాహంగా ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యాడు సుబ్బయ్య. దారి అంతా కొండ దారి. ఊరి దగ్గర కొండ మలుపులో గుహ ఉన్నది.

అందులో దయ్యాలు ఉంటాయని చెప్పుకునేవారు. ఆ పరిసరాలకు చేరే సరికి సుబ్బయ్యకు గుండె దడ పట్టుకున్నది. అసలే చీకటి గాఢాంధకారం. సుబ్బయ్య గబగబా అడుగులు వేస్తూ ఆ మలుపు తిరగబోతూండగా, "ఎవరు మీరు? చీకటి పడి ఈ వైపు రావడానికి ఎంత ధైర్యం!" అన్న మాటలు భయంకరంగా వినిపించాయి. సుబ్బయ్య గజగజలాడి పోతూ. "నేను సుబ్బయ్యను అమ్ముడుపోని మేకను ఇంటికి తోలుకు పోతున్నాను.. ఆలస్యమయింది. ఇంకెన్నడూ చీకటిపడితే ఈ చాయలకు రాను." అన్నాడు. "ఆ మేకను నా గుహలోకి తోలేసి, నీ దారిన నువు పో. మళ్లా తెల్లవారే లోపుగా ఇక్కడికి వచ్చి దాని ఖరీదు పట్టుకుపో!" అన్న మాటలు గుహలో నుంచి విని పించాయి. బతుకు జీవుడా అని సుబ్బయ్య తన మేకను గుహలోకి తోలేసి, గబగబా ఊరి వైపు నడిచాడు. కాని ఇంటికి వెళ్ళటానికి అతనికి ధైర్యం లేదు. డబ్బు ఏదని అతని భార్య ప్రాణాలు తోడేస్తుంది. దయ్యం ఏమిస్తుందో, అది తీసుకుపోతే గాని ఆమె తనను ఇంట్లో అడుగు పెట్టనియ్యదు. సుబ్బయ్య తెల్లవారేదాకా ఎవరి వీధి అరుగు మీదనో కాలక్షేపం చేసి, కాస్త ధైర్యం తెచ్చుకుని, పరుగెత్తుకుంటూ మళ్ళా గుహవైపు వచ్చాడు.

"మేక మాంసం చాలా రుచిగా ఉన్నది! ఇదుగో దాని ఖరీదు!" అన్న మాటలతోపాటు గుహలో నుంచి ఒక మూట వచ్చి సుబ్బయ్య కాళ్ల ముందు పడింది. దాన్ని తీసుకుని. పరుగు లాంటి నడకతో ఇల్లు చేరాడు, సుబ్బయ్య. లోపలికి పోతూనే తలుపు మూసి, సంచీలో డబ్బంతా నేల మీద

పోసి, లెక్క చూశాడు. యాభై రూపాయలు.

"డొక్కు మేకకు ఇంత డబ్బు పోసిన వెర్రిపీనుగు ఎవరబ్బా!" అంటూ సుబ్బయ్య భార్య బుగ్గలు నొక్కుకున్నది. ఈ సంగతి ఎవరికీ చెప్పకు సుమా!" అంటూ సుబ్బయ్య జరిగినదంతా తన భార్యకు చెప్పేశాడు. సుబ్బయ్య భార్య కూడా, "ఎవరికీ చెప్పకు సుమా!" అంటూ ఈ విషయం పొరుగింటి పుల్లమ్మకు చెప్పింది. అది పుల్లమ్మ మొగుడికి, ఎదురింటి వాడికి, వెనకింటి వాళ్ళకూ, చివరకు ఊరందరికి తెలిసి పోయింది. మేకలున్న వారందరికీ పరమానంద మయింది. మేకలు లేనివాళ్లు కొందరు ఎక్కువ ధర ఇచ్చి మేకలను కొన్నారు.

చీకటి పడే సరికి ఒకరికి తెలియకుండా ఒకరు దెయ్యపుగుహలోకి తమ మేకలన్నీ తోలేసి, వచ్చేశారు. తన భార్య బాధపడ లేక, సుబ్బయ్య కూడా మరో పది మేకలను గుహలోకి తోలి ఇంటికి వచ్చాడు. తెల్లవారు తూండగా పాతిక మంది జనం గుహ బయట పోగుపడ్డారు. కాని ఎవరికీ మేకల ఖరీదు అందలేదు. కనీసం దయ్యం కంఠమైనా వారికి వినిపించలేదు. తెల్లవారి పోయింది. అందరూ ధైర్యం చేసి గుహలోకి వెళ్ళారు. గుహలో ఒక్క మేక కూడా లేదు. కాని గుహ మధ్య బండ మీద ఒక కాగితం ఉన్నది. దాని మీద చిన్నరాయి బరువు పెట్టి ఉన్నది. ఆ కాగితం మీద ఇలా రాసి ఉన్నది.

"ఈ ఉత్తరం రాస్తున్నది దయ్యం కాదు, మీలాంటి మనిషే! పని కోసం నెల రోజులుగా మీ చుట్టూ తిరిగిన శేషయ్యను నేను! మా నాన్న చని పోయాడు. ఇంట్లో ఉన్నదంతా కలిసి వంద రూపాయల నగదు. అవి తీసుకుని నేను మీ ఊరు వచ్చి మిమ్మల్ని పని అడిగితే, కొత్తవాడివి, నిన్ను నమ్మి పని ఎలా ఇస్తాం?" అన్నారు. ఉన్న డబ్బు సగం ఖర్చయింది. ఇంకో ఊరు పోదామని సాయంకాలం ఈ దయ్యం గుహలో పడుకున్నాను. మేకను తోలుకు వస్తున్న సుబ్బయ్యను చూశాక నాకీ ఆలోచన కలిగింది. మనిషిని నమ్మలేని మీరు దయ్యాన్ని నమ్మారు! లేని దయ్యం నాకు ఎంతో మేలు చేసింది. పని చేస్తానని వచ్చినవాడికి పైస కూడా నమ్మని మీరు, తేలికగా డబ్బు వస్తుందనగానే, కట్టకట్టుకు వచ్చి పడ్డారు. మీ మేకల్ని అమ్మిన డబ్బుతో ఎక్కడైనా వ్యాపారం ప్రారంభించి ఏడాది లోపల మీ రుణం తీర్చేస్తా. నాపై నమ్మకం నాకున్నది. అంతదాకా ఓపిక పట్టండి. ఈ ఉత్తరం చదివించుకుని విన్న వాళ్ళంతా నోళ్లు వెళ్లబెట్టారు.


– వెంగళ నరేష్

ఉపాధ్యాయులు, సిద్దిపేట జిల్లా

8374535728


శతకం


# వేమన పద్యాలు

**చచ్చిపడిన పశువు చర్మంబుకండలు**
**పట్టి పెరకి తినును పరగ గ్రద్ద**
**గ్రద్ద వంటివాడు గజపతి కాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : గ్రద్ద చనిపోయిన పశువు యొక్క చర్మమును, కండలను ఊడబెరికి తినును. ఈ రాజులును గ్రద్ద వంటి వారే కదా.

**అలను బుగ్గ పుట్టినప్పుడే క్షయమౌను**
**గలనుం గాంచులక్ష్మి గనుట లేదు**
**ఇలను భోగభాగ్య మీతురు గాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : కెరటంలో బుట్టిన బుడగలు అప్పుడే నశించును. కలలో కనబడు లక్ష్మిని పొందలేను. ఈ భూమిలో భోగభాగ్యములు కూడా ఇట్టివే కదా!



కథ

# చెట్టు రహస్యం

లతీఫ్ ముఖ్‌ముదొవ్

అనగనగా ఒక ఊరిలో ఒక నది ప్రవహిస్తూ ఉండేది. దాని పక్కన మూడువందల సంవత్సరాల వయస్సు కలిగిన ఓ పెద్ద చెట్టు ఉండేది. దూరం నుండి చూస్తే, అది విచ్చుకున్న పెద్ద గొడుగులా ఉండేది. ఆ చెట్టు తొర్రలో పాములు నివసిస్తూ ఉండేవని ఊరివాళ్ళు చెప్పుకునేవారు.

ఆ చెట్టు పక్కన మురాద్ అనే పిల్లవాడు నివసిస్తుండేవాడు. రహమత్ అనే పిల్లవాడు మురాద్ ఇంటి పక్కన ఉండేవాడు. మురాద్, రహమత్లు ప్రాణస్నేహితులు. రహమత్ అపరాధ పరిశోధన పుస్తకాలు అవీ బాగా చదువుతుండేవాడు. పెద్దయ్యాక అపరాధ పరిశోధకుడు అవ్వాలని కలలు కనేవాడు. ఓ రోజు ఇద్దరు పిల్లలు అతి కష్టంమీద చెట్టు ఎక్కారు. దాని తొర్రలోకి తొంగిచూశారు. అది తేమగా, చీకటిగా ఉంది. ఊరి జనాలు చెప్పినట్టు అక్కడ ఏ పామూ లేదు. చివరికి పురుగులు కూడా లేవు. ఆ చెట్టు కింద మట్టితో సహజంగా ఏర్పడిన మట్టిదిమ్మె ఉండేది. అది కూర్చోటానికి అనుకూలంగా ఉండేది. ఆ మట్టి దిమ్మె మురాద్ వాళ్ళ పూలతోట చుట్టూ ఉన్న మట్టి గోడకు ఆనుకొని ఉండేది. సలీం అనే ముసలయ్య పొద్దున్నుండి రాత్రి వరకు ఆ మట్టిదిమ్మె మీద కూర్చుని, తన వీపుని చెట్టుబోదెకు ఆనించి, తీక్షణంగా ఓ పుస్తకం చదివేవాడు. అది పాత అరబిక్ కవిత్వ పుస్తకం. చాలాసేపు ఎదురుగా ప్రవహిస్తున్న నదిని చూస్తూ గడిపేవాడు. అప్పుడప్పుడూ తన ఫ్లాస్కులో నుండి తేనీరు, పింగాణీ పాత్రలో వంచుకుని తాగేవాడు. ఇది ప్రతిరోజు అతని దినచర్య.

పిల్లలకు వేసవి సెలవులిచ్చారు. సలీం తాతయ్య అక్కడే కూర్చుని నిద్రపోయేవాడు. అప్పుడప్పుడు నదిలోని చేప పిల్లల్ని చూస్తూ గడిపేవాడు. అతని దినచర్య పిల్లలకి వింతగా అనిపించింది. ఇంట్లో మెత్తని పరుపు ఉండగా, చెట్టు క్రింద కూర్చుని ఎందుకు నిద్రపోతున్నాడో అర్థమయ్యేది కాదు. “మురాద్! నా కళ్ళతో చూశాను. నిన్న సాయంత్రం నుండి ఈ రోజు పొద్దునదాకా సలీం తాత అలాగే చెట్టుకింద నిద్రపోతున్నాడు. నాకేదో అనుమానంగా ఉంది. ఆ చెట్టులో ఏదో రహస్యం దాగి ఉంది. ఆ రహస్యాన్ని కాపాడటానికే సలీం తాతయ్య రోజంతా ఆ చెట్టు వద్దే గడుపుతున్నాడు” అన్నాడు రహమత్.

“అవును. మా నాన్న కూడ అనేవాడు. ఆ చెట్టుకి ఎంతో చరిత్ర వుందని” అన్నాడు మురాద్. “అయితే ఆ రహస్యం ఖచ్చితంగా మట్టి దిమ్మె కిందే దాగి వుంటుంది” అన్నాడు రహమత్.

“అయితే మనం ఆ రహస్యాన్ని ఎలాగయినా కనిపెట్టాలి” అన్నాడు మురాద్. “ఆ రహస్యాన్ని కనిపెడితే, గొప్ప శాస్త్రవేత్తలుగా ఊరిలో, మన పాఠశాల్లో, దేశంలో ఎంతో పేరొస్తుంది” అన్నాడు రహమత్.

“కానీ ఎలా? సలీం తాతయ్య ఎప్పుడూ చెట్టు కింద నుండి కదలడుగా?” అన్నాడు మురాద్.

“మీ పూలతోట చివరి నుండి, చెట్టుకింద వున్న మట్టి దిమ్మె వరకు ఓ చిన్న సొరంగం తవ్వుదాం. ఏదన్నా విలువైన సంపద దొరకవచ్చు, చెట్టు రహస్యం తెలుసుకోవచ్చు. ఒకవేళ ఏమీ దొరకలేదనుకో, మనం తవ్విన దాన్ని తవ్వినట్టే పూడ్చేద్దాం” అన్నాడు రహమత్.

“భలే వుంది ఆలోచన, నేను సిద్ధం” అన్నాడు మురాద్. తరువాతి రోజు ఉదయాన్నే పెద్దవాళ్ళంతా పనులకెళ్ళాక, పిల్లలిద్దరూ పలుగు, పార పట్టుకొని సొరంగం తవ్వటం మొదలు పెట్టారు. తవ్వే క్రమంలో వీళ్ళ ముఖాలు మట్టితో నల్లగా మారిపోయాయి.

ఒకరిని చూసి ఒకరు పడి పడి నవ్వుకున్నారు. అలా ఓ ఐదు రోజులు, ఎలుకలు కలుగు తవ్వినట్లు, ఇద్దరు స్నేహితులూ చిన్న సొరంగం తవ్వారు. మొదట్లో గట్టిమట్టి బయటకు వచ్చేది. తరువాత మెత్తటి బంకమట్టి వచ్చేది. అయిదో రోజు ఉన్నట్టుండి గట్టిగా ఏదో తగిలింది. తవ్వటం ఆపేశారు. చెయ్యి పెట్టి బంకమట్టిని బయటకు తీశారు. విరిగిన పింగాణీ పాత్ర, మేక ఎముక దొరికాయి.

పురావస్తు ఆవిష్కరణల వైపు గర్వంగా చూశారు. ఇంతలో రహమత్ ఆ సొరంగమార్గంలో ఇరుక్కుపోయాడు. మురాద్, రహమత్ కాళ్ళను పట్టుకుని వెనక్కి లాగాడు. క్షేమంగా

బయటపడ్డాడు రహమత్. పిల్లలిద్దరూ భారంగా ఊపిరి పీల్చుకున్నారు. మురాద్ సొరంగంలోకి తొంగిచూశాడు. సలీం తాత చెట్టు కింద ఉన్నాడో లేడో అని. వాళ్ళ అదృష్టం తాతయ్య అక్కడ లేడు. మధ్యాన్న భోజనానికి ఇంటికి వెళ్ళినట్టున్నాడు. చెట్టు కింద వున్న మట్టిదిబ్బ పగిలిపోయి ఉండడం మురాద్ గమనించాడు. ఆ విషయాన్ని రహమత్తో చెప్పాడు. పిల్లలిద్దరూ మూడుగంటలు కష్టపడి సొరంగమార్గాన్ని మట్టితో పూడ్చేశారు. తవ్విన ఆనవాళ్ళు కనిపించకుండా దానిపై చెత్తా చెదారం పలచగా చల్లారు.

కొద్దిసేపటి తర్వాత సలీం తాతయ్య మెల్లగా నడుస్తూ చెట్టు వైపుకి వస్తున్నాడు. కర్ర సాయంతో నేలను చూస్తూ, పెద్ద చెట్టు వైపు నడుస్తున్నాడు. కూలిపోయిన మట్టిదిమ్మెను చూసి ఆశ్చర్యపోయాడు. చేతితో మట్టిని తాకాడు. అలా కూలిన దిమ్మెను చూస్తూ కొద్దిసేపు మౌనంగా నిలబడ్డాడు. దిగులుగా ఇంటికి వెళ్ళిపోయాడు. సలీం తాతయ్య కూర్చున్న మట్టిదిమ్మెను పాడు చేసినందుకు, పిల్లలిద్దరూ ఎంతో బాధపడ్డారు. తర్వాత రోజు తాతయ్యకు జ్వరం వచ్చింది. మురాద్, రహమత్ తల్లిదండ్రులు సలీం తాతయ్య బాగోగులు చూడ్డానికి వెళ్లారు. పిల్లలు తమ తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నారు. తమ వద్ద వున్న చిల్లర పైసలు జమచేసి, తాతయ్యకు ఇష్టమైన మిఠాయిలు కొన్నారు. తరువాత రోజు ఉదయం దాన్ని తీసుకుని బయలుదేరారు. దారిలో లారీ ఎదురొచ్చింది. దాంట్లో రహమత్ వాళ్ళ నాన్న, మురాద్ వాళ్ళ నాన్న వున్నారు. "ఇంట్లో వుండక, రోడ్లమీద ఏం చేస్తున్నారు?" అని గద్దించారు తల్లిదండ్రులు. తాతయ్య కోసం బహుమతి తీసుకెళ్తున్నామని చెప్పారు పిల్లలు. తల్లిదండ్రులు నవ్వి, పిల్లల్ని లారీలో ఎక్కించుకున్నారు. లారీలో ఏముందని అడిగారు పిల్లలు.

"సలీం తాతయ్య మట్టిదిమ్మె దురదృష్టవశాత్తూ కూలిపోయింది. తనకోసం చక్కటి దిమ్మెను కట్టబోతున్నాం" అన్నారు తల్లిదండ్రులు. మురాద్ వాళ్ళ నాన్న రహమత్ వాళ్ళ నాన్నతో ఇలా అన్నాడు. "ఆ చెప్తున్నాను గదా! ఆ రోజుల్లో మురాద్ చంటి పిల్లవాడు. భారీ వాన కురిసింది. నది పొంగింది. మురాద్ వాళ్ళ అమ్మ, మురాద్ ఆ నీటిలో కొట్టుకుపోతుంటే, సలీం తాతయ్య వాళ్ళ ఒక్కగానొక్క కొడుకు, నీటిలో దూకి ధైర్యంగా రక్షించాడు. కానీ, తను నీటిలోపడి చనిపోయాడు. ఆ యువకుడు మంచి కవి. చక్కటి అరబిక్ కవితల పుస్తకాన్ని కూడా ప్రచురించాడు. అప్పటి నుండి సలీం తాత, చివరికి కొడుకు జ్ఞాపకార్థంగా మిగిలిన ఆ ఒకే ఒక్క కవిత్వ పుస్తకాన్ని చదువుతూ, నదిని చూస్తూ, పెద్దచెట్టు కింద రోజంతా గడుపుతున్నాడు."

రహమత్ వాళ్ళ నాన్న ఇలా అన్నాడు, "ప్రస్తుతం ఆ పుస్తకం కనిపించటం లేదు. తన కొడుకు చివరి జ్ఞాపకం కనిపించకపోవడంతో సలీం తాత జ్వరంతో మంచాన పడ్డాడు." ఈ విషయాన్ని పిల్లలిద్దరూ విన్నారు. లారీ దిగాక, రహమత్ ఇలా అన్నాడు. "మురాద్! మనం సొరంగం తవ్వటం వలన ఆ పుస్తకం మట్టిలో కూరుకుపోవచ్చు. మనకు దొరికిన పగిలిన పింగాణీ పాత్ర తాతది అయ్యుండొచ్చు." ఇద్దరు పిల్లలు వెళ్ళి చెట్టు కింద వున్న మట్టి దిమ్మెను జాగ్రత్తగా తవ్వారు. ఆశ్చర్యం! కవితల పుస్తకం చెక్కుచెదరకుండా అక్కడే ఉంది. దానిపై వున్న మట్టిని జాగ్రత్తగా దులిపారు. సలీం తాతయ్య ఇంటికి వెళ్లి, ఆ పుస్తకాన్ని, తాత కోసం కొన్న మిఠాయిల్ని బహూకరించారు. తాతయ్య ఎంతో సంతోషించాడు. దెబ్బకి తాతయ్యకి జ్వరం కూడా తగ్గిపోయింది. ఆ తర్వాత కొన్ని రోజులకు పిల్లల తల్లిదండ్రులు ఇటుకలు, సిమెంటుతో చక్కటి దిమ్మెను కట్టారు. ఎప్పటిలాగా సలీం తాతయ్య రోజంతా దిమ్మెమీద కూర్చుని, నదిని చూస్తూ, పుస్తకం చదువుతూ గడిపేవాడు. పిల్లలిద్దరూ అప్పుడప్పుడూ తాతయ్యను పలకరించే వారు. ఇదండీ! చెట్టు వెనుక దాగిన 'రహస్యం.'




స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 81792 73971

ఇంగ్లీష్ : సీక్రెట్ ఆఫ్ ది ప్లేన్ ట్రీ
రచయిత : లతీఫ్ మక్‌ముదోవ్
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డియన్




# అందరి పండుగ
# అంబేద్కర్ జయంతి

**తేజ:** తాతయ్యా! మనం చేసుకునే పండుగలు రెండు రకాలు అని ఒకసారి మీరు అన్నట్టు గుర్తు. కాని వాటి వివరణ అప్పుడు అడగలేదు. ఇప్పుడు చెప్పవా! ప్లీజ్...

**తాత:** దానికి అంత బ్రతిమిలాట ఎందుకు? మన పండుగలు వ్యక్తిగత పండుగలు - సామూహిక పండుగలు అని రెండు రకాలు. ఈ సామూహిక పండుగల్లో స్థానిక పండుగలు. జాతీయ పండుగలు అని మళ్లీ రెండు రకాలు.

**తేజ:** స్థానిక పండుగలు అంటే అయా ప్రాంతాల వారిగా అందరు చేసుకునే పండుగలు మరి జాతీయ పండుగలు అంటే?!

**తాత:** దేశవ్యాప్తంగా అందరూ పాటించే పండుగను జాతీయ పండుగ అంటారు.

**తేజ:** అంటే స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం ఈ రెండూ జాతీయ పండుగలే కదా?!

**తాత:** అవి రెండే కాదు. కొందరు ముఖ్యమైన జాతీయ నాయకుల పుట్టిన రోజులైన జయంతులు కూడా జాతీయ పండుగలుగా నిర్వహించి నివాళులు అర్పించి ఆ రోజును సెలవు రోజుగా పాటిస్తాము.

**తేజ:** ఔను తాతయ్యా గాంధీ జయంతి రోజు సెలవు కదా?! నాకు గుర్తుంది ఈ జాబితాలో ఇంకా ఏ జాతీయ నాయకులున్నారు.

**తాత:** అంబేద్కర్, జగ్జీవన్ రాం వంటి నాయకులు ఉన్నారు. వారు అతిసాధారణ కుటుంబాల్లో పుట్టి విద్య ద్వారా అసాధారణ వ్యక్తులుగా ఎదిగారు.

**తేజ:** చదువు గొప్పదనం అదే కదా తాతయ్య! ఈ ఏప్రియల్ 14న అంబేద్కర్ జయంతి కదా? అసలు ఆయన గొప్పతనం ఏమిటి? అతని జయంతి రోజు ఏమి చేస్తారు చెప్పవా??

**తాత:** అసాధారణ మేధావి అయిన అంబేద్కర్ మహారాష్ట్రలో అంటరానివారిగా పరిగణించే "మహర్" అనే కుటుంబంలో పుట్టి అనేక అవమానాలు ఎదుర్కుంటూ అకుంఠిత దీక్షతో చదువుకుని ఎన్నో విశ్వవిద్యాలయ స్థాయి విద్యలు పూర్తి చేసుకుని, నిష్కళంక దేశభక్తునిగా, నవ భారత రాజ్యాంగ నిర్మాతగా, దళిత జనోద్ధారకుడుగా, హేతువాదిగా వుండి సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వ సాధనకు తుది శ్వాసవరకు పోరాడిన ధీశాలి డా॥ బి.ఆర్. అంబేద్కర్.

**తేజ:** మన రాజ్యాంగ రచనలో చాలా మంది పాలు పంచుకున్నారు కదా? మరి అంబేద్కర్ ఒక్కడినే

రాజ్యాంగ నిర్మాత అని ఎలా అంటారు తాతయ్యా?!

తాత: చక్కని సందేహం వచ్చింది మా తేజబాబుకి, చెబుతా విను. రాజ్యాంగ రచనకు అంబేద్కర్ మొదట డ్రాఫ్టింగ్ కమిటి సభ్యుడు మాత్రమే. అందులో ప్రధాన బాధ్యులు ఆనాటి పాలక కాంగ్రెస్ పార్టీ అనుయాయులు. కాని రాజ్యాంగ రచన ఒక చారిత్రక పని. అంబేద్కర్ అనేక పుస్తకాలు చదివిన మేధావి మాత్రమే కాదు. న్యాయశాస్త్రం మధించిన ధీరుడు. కనుక పార్టీలు సిద్ధాంతాలు పక్కన బెట్టి ప్రతిభకు పట్టాభిషేకం చేస్తూ ఆ రచనా బాధ్యత భారమంతా అంబేద్కర్‌కి అప్పగించారు రాజ్యాంగ రచనా సంఘం ప్రధాన బాధ్యులంతా.

తేజ: మన రాజ్యాంగం చాలా పెద్ద పుస్తకం కదా. అందునా చేతివ్రాతతో వ్రాసిందటగా!

తాత: అయ్యో సోషల్ విషయాలు కూడా బాగానే గుర్తు పెట్టుకున్నారుగా దొరగారు.

తేజ: మాదేముందిలే! మీ బ్లెసేస్ ఫవర్ అంతా ఇంతకీ రాజ్యాంగ రచనలో అంబేద్కర్ గారు చేసిన విశేష కృషి ఏమిటి?

తాత: తనపై పెద్దలు వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని నీతి నిజాయితీలతో అహర్నిశలు నిద్రాహారాలు మాని పని చేసి అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా తన రాజ్యాంగ రచన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసి మూడు వందల తొంభై అయిదు సూత్రాలు. తొమ్మిది పట్టికలతో. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం పునాదిగా రాజ్యాంగం వ్రాసి మనకు అందించారు. దీని ఆధారంగానే మన దేశ పాలన నేటికీ సాగుతుంది.

తేజ: సాధారణ కుటుంబంలో పుట్టిన అంబేద్కర్ కేవలం అక్షర జ్ఞానం సాయంగానే ఇంత గుర్తింపు పొందాడా? ఆయన చదువుకు సంబంధించిన విశేషాలు ఏమైనా ఉంటే చెప్పండి తాత!?

తాత: నాకు తెలిసినంత వరకు అంబేద్కర్‌గారు చదివిన డిగ్రీలు ఇప్పటి వరకూ ఎవరూ చదవలేదు. లండన్ గ్రంథాలయంలో అంబేద్కర్ వెయ్యి రోజుల్లో 16 వేల పుస్తకాలు చదివినట్టు అక్కడ రికార్డు నమోదైంది ఇంతకు మించిన ఆధారం ఏమి కావాలి?

తేజ: అందుకేగా ఐక్యరాజ్య సమితి 2017లో ప్రపంచంలోనే అత్యధిక విద్యా సంపన్నుడిగా ప్రకటించి ఆయన జయంతి ఏప్రియల్ 14ను ప్రపంచ విద్యా దినోత్సవంగా ప్రకటించింది.

తాత: వెరీగూడ్ మంచి విషయం గుర్తు చేసావ్! ఇక ఇంత గొప్ప మేధావిని కలిగిన మనం ఎంతో అదృష్టవంతులం మాత్రమే కాదు. ఆయన ఆశయాలను ఆచరిస్తూ ముందుకు సాగాలి.

తేజ: మరి ఈ జాతీయ నాయకుని జయంతిని ఎలా నిర్వహిస్తారో కూడా చెప్పండి?

తాత: అంబేద్కర్ ఆశయాల అనుచరులు, అభిమానులు మాత్రమే జరుపుకున్న ఈయన జయంతి అనంతర కాలంలో కేంద్ర ప్రభుత్వం అధికార సెలవు దినంగా ప్రకటించి దేశవ్యాప్తంగా ఆ మహనీయునికి నివాళి అర్పిస్తున్నారు. ఈ రోజును సమానత్వ దినోత్సవం, జ్ఞాన దినోత్సవంగా పిలుస్తున్నారు.

తేజ: ప్రధాన కార్యక్రమం ఎక్కడ జరుగుతుంది? ఎవరు చేస్తారు?

తాత: ప్రపంచంలోనే అతి పెద్ద జయంతిగా పరిగణించే ఈ రోజున మన దేశ రాజధాని న్యూఢిల్లీలోని పార్లమెంట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు అర్పించి ఆయన కృషిని గుర్తు చేసుకుని గౌరవిస్తారు.

తేజ: గ్రామాల్లో, పట్టణాల్లో నగరాల్లో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయడం, కొన్ని ప్రాంతాలలో ర్యాలీలు తీయడం కూడా చేస్తారు కదా? తాతయ్యా?!

తాత: ఔను, విగ్రహాలు లేని చోట ఆ మహనీయుని చిత్ర పటానికైనా జయంతి రోజు విధిగా పుష్పాంజలి చేసి వారి ఆశయాలను ఆచరిస్తామని ప్రతినబూనాలి అంబేద్కర్ కొన్ని కులాలకు కొన్ని తరగతులకు చెందినవాడిగా భావించకూడదు. అంబేద్కర్ అంటే అందరివాడు అనే భావం అందరం పంచుకోవాలి.

తేజ: షూర్ తాతయ్య ఈ విషయం మా ఫ్రెండ్స్‌కు చెబుతాను, బై మరి.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

# రెండు వేల ఏండ్ల కిందటి కళలు

## వాస్తుకళ:

శాతవాహనుల కాలంలో దక్షిణ భారతదేశంలో బౌద్ధమతం విస్తృతంగా వ్యాప్తి చెందడంతో అనేక స్తూపాలు, విహారాలు, చైత్యాలు నిర్మించబడ్డాయి. స్తూపం అనేది బుద్ధుడు లేదా బౌద్ధ సన్యాసుల అవశేషాలపై నిర్మించే నిర్మాణం. మొదట బుద్ధుని లేదా సన్యాసుల అవశేషాలను ఒక ప్రదేశంలో భద్రపరుస్తారు. ఆ తరువాత వాటి చుట్టూ గుండ్రంగా మేధి లేదా సిలిండర్ ఆకార నిర్మాణాన్ని నిర్మిస్తారు. దాని మీద అర్ధగోళాకార గుమ్మటం నిర్మించబడుతుంది. స్తూప నిర్మాణంలో ముఖ్యమైన భాగాలు ఇవి: ప్రదక్షిణ పథం, హర్మిక, ఆయక స్తంభాలు, ప్రాకారాలు, తోరణాలు. చివరగా స్తూపం పైభాగంలో గొడుగు ఆకారంలో ఉండే అలంకరణను ఏర్పాటు చేస్తారు. విహారం అనేది బౌద్ధ సన్యాసులు మరియు సన్యాసినులు నివసించే స్థలం. దీనిని సంఘారామం అని కూడా పిలిచేవారు. సాధారణంగా విహారాలను చైత్యాల సమీపంలో నిర్మించేవారు. విహారాలు సాధారణంగా చతురస్రాకారంలో లేదా దీర్ఘచతురస్రాకారంలో ఉండేవి. విహార భవనంలో మూడు వైపులా గదులు ఉండేవి. ప్రతి గదిలో సన్యాసులు విశ్రాంతి తీసుకోవడానికి రాతి బెంచీలు ఉండేవి. విహారాల చుట్టూ తోటలు ఉండటం వల్ల వాటిని ఆరామాలు అని కూడా పిలిచేవారు. ఇక్కడ ప్రార్థన సమావేశాలు, సాధనలు మరియు వ్యాయామాలకు అవసరమైన సౌకర్యాలు ఉండేవి. వర్షారామాలు అనేవి పట్టణాలకు సమీపంలో ఉన్న తోటలు. వర్షాకాలంలో మాత్రమే సన్యాసులు అక్కడ తాత్కాలికంగా నివసించేవారు.



## చైత్యాలు:

బౌద్ధుల ప్రార్థనా మందిరాన్ని చైత్యం అంటారు. చైత్యాలను పెద్ద గదులుగా, అనేక స్తంభాలతో చెక్కి నిర్మించేవారు. శాతవాహనుల పాలిత ప్రాంతంలో యావత్ తెలుగు దేశం ఉండేది కాబట్టి ఈనాటి ఆంధ్రప్రదేశ్ లో ప్రముఖ బౌద్ధ స్తూప కేంద్రాలు: ధాన్యకటకం, నాగార్జునకొండ, భట్టిప్రోలు, ఘంటసాల, జగ్గయ్యపేట, సాలిహుండం, బావికొండ, తొట్లకొండ, సంకరం (బొజ్జన్నకొండ), గోలి, అనుపు మొదలైనవి. కాగా తెలంగాణలో కూడా అనేక బౌద్ధ స్తూపాలు నిర్మించబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి: కోటిలింగాల, ధూళికట్ట, పాసిగాం, మీర్జాంపేట్, ఫణిగిరి, తిరుమలగిరి. ధూళికట్ట బౌద్ధ స్తూపం క్రీ.పూ. 2వ శతాబ్దంలో నిర్మించబడింది. అక్కడ ఒక రాతి పలకపై ఐదు తలల 'ముచిలింద నాగ' శిల్పాన్ని చెక్కారు. ఆ శిల్పం బుద్ధుని పాదముద్రల వద్ద ఉంది. ఆ కాలంలో బుద్ధుని మనిషి రూపంలో చిత్రీకరించడం ఆనవాయితీగా లేకపోవడంతో ఆయనను సూచించడానికి పాదముద్రలను మాత్రమే చెక్కేవారు. ఆ పాదముద్రలతో పాటు బ్రాహ్మీ లిపిలో చిన్న శాసనం కూడా ఉంది.

## శిల్పకళ:

శాతవాహనుల కాలంలోని శిల్పకళను పండితులు సాధారణంగా అమరావతి శైలి అని పిలుస్తారు. క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 2వ శతాబ్దం వరకు ఉన్న కాలాన్ని ఈ శిల్పకళ యొక్క సువర్ణయుగంగా భావిస్తారు. ఈ శిల్పకళ ప్రధానంగా మూడు కేంద్రాల చుట్టూ అభివృద్ధి చెందింది: అమరావతి స్తూపం, నాగార్జునకొండ, జగ్గయ్యపేట. స్తూప వేదిక యొక్క నాలుగు వైపులా ఐదేసి స్తంభాలు నిర్మించేవారు. ఈ ఐదు స్తంభాలు బుద్ధుని జీవితంలోని ఐదు ముఖ్య దశలను సూచిస్తాయి: 1. జననం, 2. మహాభినిష్క్రమణం, 3. జ్ఞానోదయం, 4. ధర్మ బోధన, 5. పరినిర్వాణం. ఈ దశలను సూచించడానికి కొన్ని చిహ్నాలను ఉపయోగించారు: 1. కమలం (జననం), 2. గుర్రం (మహాభినిష్క్రమణం), 3. బోధి వృక్షం (జ్ఞానోదయం), 4. ధర్మచక్రం (ధర్మ బోధన), 5. స్తూపం (పరినిర్వాణం) అమరావతి శిల్పకళ ప్రభావం దక్షిణ-ఆసియా దేశాలకు కూడా విస్తరించింది. ముఖ్యంగా అన్నాం (వియత్నాం), థాయ్‌లాండ్, జావా, సుమత్రా, బోర్నియో వంటి ప్రాంతాలకు ఈ కళాశైలి వ్యాపించింది.

## చిత్రకళ:

కళా విమర్శకుల అభిప్రాయం ప్రకారం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలో ఉన్న అజంతా గుహలలోని తొమ్మిదవ, పదవ గుహలలో కనిపించే వర్ణ చిత్రాలు శాతవాహనుల కాలానికి చెందినవిగా భావించబడుతున్నాయి. ఈ చిత్రాలలో జాతక కథలు ఆధారంగా రూపొందించిన దృశ్యాలు కనిపిస్తాయి. బుద్ధుడు మరియు బోధిసత్వుల చిత్రాలు కూడా ఉన్నాయి. ఈ గుహలలో కనిపించే ముఖ్యమైన చిత్రాలు: 1. బోధి వృక్షానికి భక్తితో నమస్కరిస్తున్న దృశ్యం, 2. 15 మంది కలిసి నృత్యం చేస్తున్న దృశ్యం, 3. ఇతర మతపరమైన మరియు సామాజిక అంశాల చిత్రణ. అజంతా చిత్రాలు మరియు అమరావతి శిల్పాల మధ్య ఉన్న సాదృశ్యాల ఆధారంగా పండితులు ఈ రెండూ శాతవాహనుల కాలానికి చెందినవిగా భావిస్తున్నారు. అదే కాలానికి చెందిన చిత్రాలు మరికొన్ని గుహాలయాలలో కూడా కనిపిస్తాయి: బేద్సా, పిటల్ఖోరా, జున్నార్ గుహలు.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078




# కలంచెలిమి



**తాటికొండ బ్రహ్మేంద్ర**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
ఎస్ ఎస్ కాలనీ, డోను,
నంద్యాల.



**గుర్రం సాన్విక శ్రీ**
3వ తరగతి,
ఎంపీపీఎస్, రచ్చపల్లి.

**అంబటి లక్షణ**
6వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
లింగన్నపేట, మం.గంభీరావుపేట
రాజన్న సిరిసిల్ల.



**బెందాళం సిద్ధార్థ్**
10వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ముత్యాల పేట, శ్రీకాకుళం జిల్లా





**ఎం. సాయి శ్రీ**
10వ, తరగతి
మోమినాన్ స్కూల్, ఖమ్మం.



**ఆర్. ప్రవళిక**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్,
బీబీపేట.



# సన్నాయి నొక్కులే గాని, సంగీతం లేదన్నట్లు

సన్నాయి నొక్కులే గాని, సంగీతం లేదన్నట్లు కొందరి మాటలు కోటలు దాటుతుంటాయి. పనులు ప్రారంభంలోనే ఉంటాయి. పనిని మొదలు పెట్టకుండానే ఏవేవో గొప్పలు చెపుతూ ఉంటారు. ఒక పనిని మొదలు పెట్టినట్టు కొన్ని రుజువులు చూపిస్తారు. పని అంతా అయి పోయినట్టు మాటలు చెపుతారు. ఇలాంటి వారు కబుర్లతోనే కాలయాపన చేస్తుంటారు. పనులు మాత్రం ఒక్క అంగుళం కూడా ముందుకు జరగవు. కొన్ని కొన్ని కార్యాలయాలు ఉంటాయి. అక్కడ పని చేసే గుమాస్తాలలో ఈ జాప్యం ఎక్కువగా ఉంటుంది. నిముషంలో పని అయిపోతుంది అంటూనే రోజులు గడిపేస్తూ ఉంటారు. రోజులు గడిచినా ఆ పనిని మాత్రం ముట్టుకోరు. ఏ రోజుకారోజు వాయిదా వేసుకుంటూ పోతుంటారు. తీరా ఎన్నాళ్లకో ఆ పనిని చేసి పై అధికారులకు చూపించాలి అనుకుంటారు. అప్పటికి పరిస్థితులు మారిపోతాయి. ఇలాంటి సందర్భాలలో అలాంటి వ్యక్తుల గురించి మాట్లాడుకునేటపుడు ఈ సామెతను ఉపయోగిస్తూ ఉంటారు. అదెలాగంటే – సంగీత కచేరికి సన్నాయి మేళం వచ్చింది. సన్నాయి వాడు కచేరి ప్రారంభించే ముందుగా సన్నాయి పీకను పెడతాడు. శృతి చేసుకోవటానికి 'పీపీపీ'అని ఊదుతాడు. కచేరీకి వచ్చిన వారంతా 'సన్నాయి ఎలా వాయిస్తాడా?' అని ఆతృతగా ఎదురు చూస్తుంటారు. కానీ, ఎంతసేపటికీ సన్నాయిని శృతి చేసుకుంటూనే ఉంటాడు. అసలు రాగాన్ని ఆలపించడు.

ఇలాంటి వారు చేయాలనుకున్న పనిని కొద్దిగా చేస్తారు. కాలాన్ని జాప్యం చేస్తారు. అంతేగాని పూర్తి పనిని ఎప్పుడూ చేయరు. కచేరీ మొదలు కాదు. సన్నాయిని శృతి చేసుకోవడం పూర్తి కాదు. ఇలాంటి వారి గురించి చెప్పేటప్పుడు ఈ సామెతను ఉపయోగిస్తారు.

– 'బాల కథా సౌరభం' నుండి...

## మ్యాథ్స్ ట్రిక్స్

# ముందుగా జవాబు 2

1. ప్రేక్షకులను ఒక 4 అంకెల సంఖ్యను మీకు చెప్పి రాయమనండి. 2. మీరు రహస్యంగా జవాబు రాసి వారి చేతికి ఇవ్వండి.
3. ఇప్పుడు మరొక రెండు సంఖ్యలను మీకు చెప్పి రాయమనండి.
4. వారు రెండు సంఖ్యలు చెప్పిన తరువాత మీరు మరో రెండు సంఖ్యలు వారికి చెప్పండి.
5. ఈ 5 సంఖ్యలను కూడమని చెప్పండి.
6. మీరు ముందుగా రాసి ఇచ్చిన జవాబును చూడమని చెప్పండి. ఆ రెండూ ఒకటే.

| | | |
|---|---|---|
| ఉదా: | వారు చెప్పిన మొదటి సంఖ్య | 2649 |
| | తర్వాత చెప్పిన రెండు సంఖ్యలు | 7592 |
| | | 1365 |
| | మీరు చెప్పిన రెండు సంఖ్యలు | 2407 |
| | | 8634 |
| | | **22647** |

**మీరు ముందుగా రాసిన జవాబు 22647**

**రహస్యం:** వారు మొదట రాసిన సంఖ్యకు (2649) ముందు 2 రాసి ఆ సంఖ్య నుండి నుండి 2 తీసివేసి మిగిలిన అంకెలను యధాతదంగా రాయాలి. వారు రాసిన సంఖ్యలకు ఎంత కలిపితే 9 అవుతుందో ఆ బేధాలను చివరి రెండు సంఖ్యలుగా మీరు చెప్పాలి.

**గమనిక:** మొదటి సంఖ్య నుండి 2 తీసివేయాలి. జవాబు స్థానంలో మొదట 2 రాయాలి.

(2)6 4(9)
7 5 9 2
2 5 0 7
1 3 6 5
8 6 3 4

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

## బాలచెలిమి క్లబ్

# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.


**చెలిమి క్లబ్**

పేరు : ------------------
తండ్రి పేరు : ------------------
పుట్టినతేదీ : ------------------
చిరునామా : ------------------
------------------
------------------
పిన్ : ------------------
హాబీలు : ------------------
మొబైల్ : ------------------
ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com






# సూపర్ కంప్యూటర్లను మించే శక్తి : క్వాంటమ్ కంప్యూటింగ్

ప్రపంచంలో సాంకేతికత వేగంగా మారుతోంది. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాలు మన రోజువారీ జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. ఈ సాంకేతిక అభివృద్ధి ప్రయాణంలో తదుపరి పెద్ద అడుగుగా భావిస్తున్నది క్వాంటమ్ కంప్యూటింగ్. కంప్యూటింగ్ ప్రపంచంలో కొత్త విప్లవాన్ని సృష్టించే సామర్థ్యం ఉన్న ఈ సాంకేతికత, ముఖ్యంగా యువతకు భవిష్యత్తులో విశేష అవకాశాలను అందించే రంగంగా మారుతోంది.

ఇప్పటివరకు మనం ఉపయోగిస్తున్న కంప్యూటర్లను క్లాసికల్ కంప్యూటర్లు అని పిలుస్తారు. ఇవి సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి బిట్ (Bit) అనే డేటా యూనిట్‌ను ఉపయోగిస్తాయి. ప్రతి బిట్‌కు రెండు స్థితులు మాత్రమే ఉంటాయి – 0 లేదా 1. ఈ విధంగా క్లాసికల్ కంప్యూటర్లు ఒక సమస్యను దశలవారీగా పరిష్కరిస్తాయి. అందువల్ల సాధారణ పనుల నిర్వహణలో ఇవి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తాయి. ఉదాహరణకు ఇంటర్నెట్ బ్రౌజింగ్, వీడియోలు చూడడం, గేమ్స్ ఆడడం, పత్రాలు తయారు చేయడం వంటి పనులు ఇవి సులభంగా నిర్వహిస్తాయి.

అయితే శాస్త్ర పరిశోధనలు, వాతావరణ అంచనాలు, ఔషధాల అభివృద్ధి వంటి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి మరింత శక్తివంతమైన కంప్యూటింగ్ అవసరం ఏర్పడింది. ఈ అవసరాన్ని తీర్చడానికి శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతే క్వాంటమ్ కంప్యూటింగ్.

క్వాంటమ్ కంప్యూటర్లు సాధారణ బిట్లకు బదులుగా క్విబిట్ (Qubit) అనే డేటా యూనిట్‌ను ఉపయోగిస్తాయి. సాధారణ బిట్ ఒకేసారి 0 లేదా 1 స్థితిలో మాత్రమే ఉంటుంది. కానీ క్విబిట్ ఒకేసారి 0, 1 లేదా రెండూ కలిసి ఉన్న స్థితిలో ఉండగలదు. ఈ లక్షణాన్ని సూపర్‌పొజిషన్ (Superposition) అంటారు. దీని వల్ల క్వాంటమ్ కంప్యూటర్లు ఒకేసారి అనేక లెక్కలను నిర్వహించే సామర్థ్యాన్ని పొందుతాయి. ఫలితంగా క్లిష్టమైన సమస్యలను చాలా వేగంగా పరిష్కరించగలుగుతాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో మరో ముఖ్యమైన సూత్రం

ఎంటాంగిల్‌మెంట్ (Entanglement). ఇందులో రెండు క్విబిట్లు పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఒక క్విబిట్‌లో మార్పు జరిగినప్పుడు మరొకదానిపై కూడా వెంటనే ప్రభావం పడుతుంది. ఈ లక్షణం కంప్యూటింగ్ శక్తిని మరింత పెంచుతుంది. అలాగే ఇంటర్‌ఫెరెన్స్ (Interference) అనే సూత్రం ద్వారా సరైన సమాధానాలను బలపరచి, తప్పు ఫలితాలను తగ్గించే విధంగా వ్యవస్థ పని చేస్తుంది. ఈ సాంకేతికత భవిష్యత్తులో అనేక రంగాలలో విప్లవాత్మక మార్పులను తీసుకురాగలదు. ముఖ్యంగా వైద్య రంగంలో కొత్త మందులను వేగంగా అభివృద్ధి చేయడంలో ఇది సహాయపడుతుంది. సైబర్ భద్రత రంగంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ విధానాలను రూపొందించవచ్చు. వాతావరణ మార్పులు మరియు ప్రకృతి విపత్తుల అంచనాలు చేయడంలో కూడా ఇది కీలకంగా మారవచ్చు. అదే విధంగా ట్రాఫిక్ నిర్వహణ, సరఫరా వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో కూడా క్వాంటమ్ కంప్యూటింగ్ ముఖ్య పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సాంకేతికత ఇంకా అభివృద్ధి దశలో ఉన్నప్పటికీ, ప్రపంచంలోని ప్రముఖ సాంకేతిక సంస్థలు దీనిపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నాయి. భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో నిపుణుల అవసరం పెరిగే అవకాశం ఉంది. అందువల్ల యువత ఈ రంగంపై అవగాహన పెంచుకుని శాస్త్ర, సాంకేతిక విద్యపై దృష్టి పెట్టడం ఎంతో అవసరం. మొత్తానికి, క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్తులో ప్రపంచాన్ని మార్చే సామర్థ్యం కలిగిన సాంకేతికతగా నిలుస్తుంది. శాస్త్రవేత్తల పరిశోధనలు విజయవంతమైతే, ఇది వైద్యం నుండి అంతరిక్ష పరిశోధన వరకు అనేక రంగాల్లో కొత్త మార్గాలను తెరుస్తుంది. యువత ఈ మార్పును అర్థం చేసుకుని కొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే, భవిష్యత్తులో సాంకేతిక ప్రపంచంలో భారతదేశం మరింత ముందుకు సాగుతుంది.

– లత

e: ogshydcbse@gmail.com

# యువ కర్ణాటక సంగీత ప్రతిభ – గుంటూరు శ్రీ హవాణి



హైదరాబాద్ నగరానికి చెందిన గుంటూరు శ్రీ హవాణి ప్రతిభావంతమైన యువ కర్ణాటక సంగీత కళాకారిణి. 15 జూలై 2011న జన్మించిన ఆమె ప్రస్తుతం భావన్స్ రామకృష్ణ విద్యాలయం, హైదరాబాద్‌లో 9వ తరగతి చదువుతోంది. చిన్న వయస్సు నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకున్న శ్రీహవాణి, గాత్ర సంగీతం మరియు వీణ వాదనలో సమాన నైపుణ్యంతో ముందుకు సాగుతోంది. గాత్ర సంగీతంలో శ్రీమతి శ్యామల రవి గారి వద్ద, వీణ వాద్యంలో శ్రీమతి కృష్ణ కుమారి గారి వద్ద శిక్షణ పొందుతోంది. గురువుల మార్గదర్శకత్వంలో కర్ణాటక సంగీత సంప్రదాయాలను లోతుగా అభ్యసిస్తూ తన ప్రతిభను అభివృద్ధి చేసుకుంటోంది. 2024లో హైదరాబాద్‌లోని నేషనల్ సంస్కృత యూనివర్సిటీ ఆమెకు ప్రతిష్ఠాత్మకమైన “సంగీత బాల సరస్వతి” బిరుదును ప్రదానం చేసింది. శ్రీ హవాణి అనేక ప్రముఖ సంగీత పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు పొందింది. కళాసాగరం వోకల్ పోటీలు (2024), నవ్య నాటక సమితి వీణ పోటీలు (2024, 2025), శ్రీ రాగం వీణ పోటీలు (2025), శారద కల్చరల్ ట్రస్ట్ వోకల్ పోటీలు (2025) వంటి పోటీల్లో తన ప్రతిభను చాటుకుంది. ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ రమణ బాలచంద్రన్, శ్రీమతి జయంతి కుమారేశ్, శ్రీ శ్రీరామ్ మరియు శ్రీమతి అమృత మురళి నిర్వహించిన వర్క్‌షాప్‌లలో పాల్గొని సంగీతంపై మరింత అవగాహన పెంపొందించుకుంది. శృంగేరి శంకరాచార్యులు, కాంచీ శంకరాచార్యుల సమక్షంలో కూడా ఆమె సంగీత ప్రదర్శనలు ఇవ్వడం విశేషం. వివిధ సాంస్కృతిక వేదికలు మరియు ఆధ్యాత్మిక కేంద్రాలలో ప్రదర్శనలు ఇస్తూ, భవిష్యత్తులో ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణిగా ఎదగాలని లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

– బాలచెలిమి డెస్క్



# సింహం - కుందేలు కథ

ఒక పెద్ద దట్టమైన అడవిలో ఒక సింహం ఉండేది. ప్రతిరోజూ జంతువులను వేటాడి తినేది. జంతువులు అన్నీ భయం, భయంతో జీవించేవి. ఒకరోజు జంతువులు అన్ని కలిసి, సింహం వద్దకు వెళ్లి ఇలా వేడుకొన్నాయి "ప్రతిరోజూ ఒక్క జంతువు చప్పున నీ దగ్గరకు వస్తాం మిగతావాళ్లను వదిలేయి" అని సింహాన్ని ప్రతిమాలినాయి. అందుకు సింహం అంగీకరించింది.

ఒకరోజు కుందేలు తన వంతు వచ్చింది. కానీ అది సింహం దగ్గరకు ఆలస్యంగా వెళ్లింది. కోపంతో సింహం, "ఎందుకు ఆలస్యం అయ్యింది?" అని గర్జించింది. కుందేలు తెలివిగా, "మార్గంలో మరో సింహం నన్ను ఆపి, 'నేనే అడవికి రాజును' అని చెప్పింది. అది నిన్ను పోరాటానికి పిలుస్తోంది" అంది.

సింహం అహంకారంతో మండిపోయింది. "నన్ను సవాలు చేసే వాడు ఎవడు?" అంటూ కుందేలును వెంట తీసుకుని ఒక లోతైన బావి దగ్గరకు వెళ్లింది. కుందేలు బావిలోకి చూపిస్తూ, "అదిగో అదే సింహం" అంది. సింహం నీటిలో తన ప్రతిబింబాన్ని చూసి, అది నిజమైన సింహమేనని భావించి గర్జిస్తూ బావిలోకి దూకింది. లోతైన నీటిలో పడిపోయి మునిగిపోయి చనిపోయింది. అలా తెలివితో చిన్న కుందేలు పెద్ద సింహాన్ని జయించింది. అడవిలో జంతువులు అన్నీ సంతోషించి కుందేలును మెచ్చుకొన్నాయి.

### ఈ కథలో సైన్స్ ఏమిటి?

సింహం-కుందేలు కథలో కాంతి పరావర్తనం, ప్రతిధ్వని మరియు గురుత్వాకర్షణ వంటి శాస్త్రీయ సూత్రాలు కనిపిస్తాయి. బావిలోని ప్రశాంతమైన నీటి ఉపరితలం అద్దంలా పని చేసి సింహానికి తన ప్రతిబింబం మరో సింహంలా కనిపించడం కాంతి పరావర్తన లక్షణంనకు ఉదాహరణ. బావిలోకి గర్జించిన సింహపు శబ్దం గోడలపై తాకి తిరిగి వినిపించడం ప్రతిధ్వని లక్షణాన్ని చూపిస్తుంది. కోపంతో దూకిన సింహం కిందికి పడిపోవడం భూమి గురుత్వాకర్షణ వల్లనే జరుగుతుంది. ఈ మూడు శాస్త్రీయ అంశాలు కథలో సహజంగా కలిసిపోయి విద్యార్థులకు భౌతికశాస్త్ర సూత్రాలను ఆసక్తికరంగా అర్థమయ్యేలా చేస్తాయి.



**1: సింహం ప్రతిబింబం నీటిలో ఎందుకు కనిపించింది?**

కాంతి పరావర్తనం (Reflection of Light) కారణముగా, సూర్యకాంతి సింహం మీద పడి, ఆ కాంతి నీటి ఉపరితలాన్ని తాకి తిరిగి సింహం కళ్లకు చేరుట వలన అప్పుడు సింహంనకు తన ప్రతిబింబం నీటిలో కనిపించింది. బావిలో నీరు సాధారణంగా ప్రశాంతంగా (నిశ్చలంగా) ఉంటుంది. అందువల్ల నీటి ఉపరితలం సజావుగా ఉండి అద్దంలా పనిచేస్తుంది. కాబట్టి ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుందినీటి ఉపరితలం సజావుగా ఉన్నప్పుడు మాత్రమే ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుంది. నీరు ప్రశాంతంగా ఉన్నప్పుడు అద్దంలా పని చేస్తుంది నీరు కదిలితే వెంటనే ప్రతిబింబం మారిపోతుంది లేదా మాయమవుతుంది. మురికి నీటిలో ప్రతిబింబం స్పష్టంగా కనిపించదు. ఇది నిజ ప్రతిబింబం కాదు, మిధ్యా ప్రతిబింబం

**2. నీరు కదిలితే ప్రతిబింబం ఎందుకు వంకరగా కనిపిస్తుంది?**

నీటి ఉపరితలం సమతలంగా లేకపోతే కాంతి వివిధ దిశల్లో పరావర్తనం చెందును అందువల్ల ప్రతిబింబం వంకరగా లేదా కదిలినట్టు కనిపిస్తుంది.

**3. బావిలో ప్రతిధ్వని (Echo) కూడా ఎందుకు వినిపించింది?**

సింహం గర్జించిన శబ్ద తరంగాలు బావి గోడలకు తాకి తిరిగి వచ్చాయి. ఈ తిరిగివచ్చే శబ్దాన్నే ప్రతిధ్వని అంటారు. శబ్దం ప్రతిబింబించే గోడ, కొండ, భవనం వంటి ఉపరితలం కనీసం సుమారు 17 మీటర్ల దూరంలో ఉండాలి. మన చెవులు ఒక శబ్దం తర్వాత మరో శబ్దాన్ని వేరు చేసి వినడానికి కనీసం 0.1 సెకన్లు అవసరం.

**4. "సింహం బావిలోకి దూకితే ఎందుకు బావిలో పడిపోయింది?"**

సింహం బావిలోకి దూకినప్పుడు అది భూమి గురుత్వాకర్షణ (Gravity) ప్రభావానికి లోనైంది. భూమి మీద ఉన్న ప్రతీ వస్తువును భూమి తన వైపుకు ఆకర్షిస్తుంది. అందువల్ల సింహం గాల్లోకి దూకిన క్షణం నుంచే భూమి ఆకర్షణ శక్తి దాన్ని కిందికి లాగింది. దూకిన వేగంతో పాటు గురుత్వాకర్షణ కలిసి సింహాన్ని వేగంగా కిందికి పడేసాయి. పైగా నీటిలో పడిన తర్వాత నీరు కదిలి, గోడలు మృదువుగా ఉండటం వల్ల బయటకు ఎక్కడం సాధ్యం కాలేదు. అందుకే సింహం బావిలో పడిపోయి బయటకు రాలేకపోయింది.


– కె శ్రీకృష్ణ సాయి

రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)

m : 9866130320




# సుప్రీంకోర్టు అధికార పరిధి - ఐదు రిట్‌ల ప్రాముఖ్యత

భారత రాజ్యాంగంలో Supreme Court of India కు సంబంధించిన నిబంధనలు Article 124 నుండి Article 147 వరకు ఉన్నాయి. భారత రాజ్యాంగంలో సుప్రీంకోర్టుకు విస్తృత అధికారాలు ఉన్నాయి. ముఖ్యంగా Article 32 ద్వారా మౌలిక హక్కులను రక్షించడం, రిట్ పిటిషన్లు జారీ చేయడం, అప్పీల్ విచారణలు, రాష్ట్రపతికి సలహా ఇవ్వడం వంటి కీలక బాధ్యతలను Supreme Court of India నిర్వహిస్తుంది.

### సుప్రీంకోర్టు అధికారాలు (Powers of Supreme Court)

1. ప్రాథమిక అధికార పరిధి (Original Jurisdiction) - Article 131
   ఈ అధికారం ప్రకారం కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లేదా రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను సుప్రీంకోర్టు నేరుగా విచారిస్తుంది.
2. అప్పీల్ అధికార పరిధి (Appellate Jurisdiction) - Articles 132-136
   హైకోర్టుల తీర్పులపై అప్పీల్‌గా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు.
   Article 132 – రాజ్యాంగ సంబంధిత కేసులు, Article 133 – సివిల్ కేసులు, Article 134 – క్రిమినల్ కేసులు Article 136 – Special Leave Petition (SLP)
3. సలహా అధికార పరిధి (Advisory Jurisdiction) - Article 143
   రాష్ట్రపతి ముఖ్యమైన రాజ్యాంగ లేదా చట్ట సంబంధిత విషయాలపై సుప్రీంకోర్టు అభిప్రాయం కోరవచ్చు.
4. రాజ్యాంగ పరిరక్షణ (Guardian of Constitution)
   సుప్రీంకోర్టు Judicial Review ద్వారా పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే వాటిని రద్దు చేయగలదు.
5. మౌలిక హక్కుల రక్షణ – Article 32
   పౌరుల మౌలిక హక్కులు ఉల్లంఘించబడితే నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. దీనిని డాక్టర్ B.R. Ambedkar "రాజ్యాంగ హృదయం మరియు ఆత్మ (Heart and Soul of Constitution)" అని పేర్కొన్నారు.

### రిట్ పిటిషనల్లు (Writ Petitions)

రాజ్యాంగంలోని Article 32 ప్రకారం సుప్రీంకోర్టు మరియు Article 226 ప్రకారం హైకోర్టులు రిట్‌లు జారీ చేయగలవు.

1. హేబియస్ కార్పస్ (Habeas Corpus)
   అన్యాయంగా అరెస్ట్ చేసిన వ్యక్తిని కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించే రిట్.
2. మాండమస్ (Mandamus)
   ప్రభుత్వ అధికారి లేదా సంస్థ తన చట్టబద్ధమైన విధిని నిర్వర్తించకపోతే ఆ పని చేయాలని కోర్టు ఆదేశించే రిట్.
3. ప్రొహిబిషన్ (Prohibition)
   కింద స్థాయి కోర్టు తన అధికార పరిధి దాటి కేసు విచారణ చేస్తే దానిని ఆపమని పై కోర్టు ఇచ్చే ఆదేశం.
4. సర్టియోరారీ (Certiorari)
   కింద కోర్టు ఇచ్చిన తప్పు తీర్పును రద్దు చేయడానికి పై కోర్టు జారీ చేసే రిట్.
5. కో వారంటో (Quo Warranto)
   ఒక వ్యక్తి ప్రభుత్వ పదవిని చట్టబద్ధంగా చేపట్టాడా లేదా అనే విషయాన్ని ప్రశ్నించే రిట్.

– బాలచెలిమి డెస్క్

# సముద్రంలో వినిపించే మధుర స్వరాలు

# బెలుగాస్



బెలుగా తిమింగలం ప్రపంచంలోని అత్యంత ప్రత్యేకమైన సముద్ర జీవుల్లో ఒకటిగా గుర్తించబడింది. తెల్లని రంగుతో కనిపించే ఈ తిమింగలాలను సాధారణంగా "సీ కనేరీస్" అని పిలుస్తారు. వీటి స్వరాలు సంగీతంలా వినిపించడం వల్ల ఈ పేరు వచ్చింది. ప్రధానంగా ఆర్కిటిక్ సముద్ర ప్రాంతాల్లో నివసించే ఈ సముద్ర సస్తనజీవులు తమ తెలివితేటలు, సామాజిక జీవన విధానం, ప్రత్యేక లక్షణాల కారణంగా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

సాధారణంగా బెలుగా తిమింగలాలు నాలుగు నుంచి ఐదు మీటర్ల పొడవు వరకు పెరుగుతాయి. వీటి బరువు సుమారు ఒకటి నుంచి ఒకటిన్నర టన్నుల వరకు ఉంటుంది. ఇతర తిమింగలాలతో పోలిస్తే వీటికి పూర్తిగా తెల్లని రంగు ఉండటం ప్రత్యేక లక్షణం. చిన్న వయస్సులో బూడిద లేదా నలుపు రంగులో ఉండే ఇవి, వయస్సు పెరుగుతున్న కొద్దీ క్రమంగా తెల్లని రంగును సంతరించు కుంటాయి. మరో విశేషం ఏమిటంటే ఇతర తిమింగలాల మాదిరిగా వీటికి వెనుక భాగంలో డోర్సల్ ఫిన్ ఉండదు. మంచుతో కప్పబడిన సముద్ర ప్రాంతాల్లో సులభంగా సంచరించేందుకు ఇది అనుకూలంగా ఉంటుంది.

బెలుగాస్ ప్రధానంగా చల్లని సముద్ర ప్రాంతాల్లో గుంపులుగా జీవిస్తాయి. కెనడా, రష్యా, గ్రీన్‌ల్యాండ్ సమీపంలోని ఆర్కిటిక్ సముద్ర ప్రాంతాల్లో ఇవి విస్తృతంగా కనిపిస్తాయి. శీతాకాలంలో మంచుతో కప్పబడిన సముద్ర ప్రాంతాల్లో నివసించే ఇవి, వేసవికాలంలో కొంత వెచ్చని నీటి ప్రాంతాలవైపు వలస వెళ్తాయి. పరస్పరం శబ్దాల ద్వారా సంభాషించుకునే వీటిని సముద్రంలోని అత్యంత శబ్దాలు చేసే తిమింగలాల్లో ఒకటిగా భావిస్తారు. ఆహారంగా ప్రధానంగా చేపలు, రొయ్యలు, పీతలు వంటి చిన్న సముద్ర జీవులను తీసుకునే బెలుగాస్ సముద్ర అడుగున ఉన్న ఆహారాన్ని గుర్తించడానికి "ఎకోలోకేషన్" అనే విధానాన్ని ఉపయోగిస్తాయి. శబ్ద తరంగాలను విడుదల చేసి వాటి ప్రతిధ్వనుల ఆధారంగా ఆహారం ఉన్న ప్రదేశాన్ని గుర్తించడం వీటి ప్రత్యేకత.

ఇటీవలి కాలంలో సముద్ర కాలుష్యం, వాతావరణ మార్పులు, మంచు కరుగుదల వంటి కారణాల వల్ల బెలుగాస్ సంఖ్య తగ్గుముఖం పడుతున్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటి సంరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సంస్థలు చర్యలు చేపడుతున్నాయి. ముఖ్యంగా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN) జీవజాతుల స్థితిని అంచనా వేసి, వాటి సంరక్షణకు అవసరమైన సూచనలు అందిస్తోంది. IUCN రెడ్ లిస్ట్ ద్వారా బెలుగాస్ వంటి జీవజాతుల పరిస్థితిని పర్యవేక్షిస్తూ సంరక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇస్తోంది. ప్రకృతిలో అరుదైన సముద్ర జీవుల్లో ఒకటైన బెలుగాస్ సంరక్షణ పట్ల సమాజంలో అవగాహన పెరగడం అవసరం. సముద్ర జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో ఇవి ముఖ్యమైన భాగంగా నిలుస్తున్నాయి.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036

కథ

# వేప పువ్వు - బెల్లం



"కోడలు పిల్లా రేపు ఉగాదికి మురుకులు చేయనక్కర లేదు" అమ్మ వైపు చూస్తూ నాన్నమ్మ చెప్పడం పిల్లలిద్దరూ విన్నారు.

నాన్నమ్మ గురక పెడుతూ నిదురించే సమయాన పిల్లలిద్దరూ తల్లి దగ్గరకు వచ్చారు.

"నాన్నమ్మ చాలా చెడ్డది. మురుకులు చేయవద్దంది." ఎనిమిదవ తరగతి చదివే రాము అన్నాడు.

"ఎందుకలా అన్నదో అర్థం కాలేదు కానీ మీ నాన్నమ్మ చాలా మంచిది" అంది అమ్మ.

"అమ్మా నాకు తెలుసు. నాన్నమ్మకు తొంబై సంవత్సరాల వయసు దాటింది. నోటిలోని ముప్పైరెండు పళ్ళు పడిపోయింది. పళ్లు లేకుండా మురుకులు నమలడం కష్టం. తాను తినకుంటే ఎవరూ తినకూడదని నిర్ణయించు కొంది" ఆరవ తరగతి చదివే సోము అన్నాడు.

"ఉగాది పచ్చడిలో చేదుగా వుండే వేపపువ్వు లాంటిది నాన్నమ్మ" రాము అన్నాడు.

"మీరెన్నయినా చెప్పండి మీ నాన్నమ్మ మనసు ఉగాది పచ్చడిలో బెల్లం లాంటిది" అంది తల్లి.

"నాన్నమ్మకు తెలీకుండా మురుకులు చేయవచ్చుగా" అడిగాడు పెద్ద కొడుకు.

"నాన్నమ్మ ఎందుకలా చెప్పిందో అర్థం కాకపోయినా పెద్దల మాట వినాలి."

ఉగాది రోజు వేప పచ్చడితో అమ్మ వచ్చింది.

అక్కడ వున్న నాన్నమ్మ తన మనవళ్లను ఇద్దరినీ పిలిచి "మీ అమ్మకు ఈ మధ్యనే జ్వరం వచ్చి ఇప్పుడే బాగయింది. ఈ సమయంలో మురుకులు చేయడం మరింత శ్రమ అనిపిస్తుంది. వయసు మళ్లడం వలన మునుపటిలా నేను సాయం చేయలేను అందుకే ఈ ఉగాది రోజున మురుకులు చేయవద్దని చెప్పాను. మీరు గోవిందు అంగడికెళ్ళి మురుకులు కొనుక్కొని రండి" అంటూ కొంగున వున్న రూపాయ నోట్లను ఇచ్చింది .

"నాన్నమ్మ మమ్మల్ని క్షమించండి మీరు మురుకులని నమలడానికి మీకు పళ్ళు లేవని చేయవద్దని చెప్పారను కొన్నాము" అన్నాడు రాము.

"నాకూ మురుకులంటే చాలా ఇష్టం. పళ్ళు లేకపోతేనేం నోటిలో ఉంచుకొంటే కాస్సేపట్లో మెత్త బడుతుంది" నవ్వుతూ అంది నాన్నమ్మ. అమ్మ ఇచ్చిన ఉగాది పచ్చడి రాము, సోము తింటున్న సమయాన అందులోని బెల్లం తీపు నాన్నమ్మ మనసును గుర్తు తెచ్చింది.

- ఓట్ర ప్రకాష్ రావు
తిరుత్తణి
m : 09787446026

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అశ్వారావుపేట



విద్యార్థుల అభివృద్ధికి పుస్తకాలు గొప్ప మార్గదర్శకాలు. ఈ గ్రంథాలయం జ్ఞానవనంగా మారాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రతి విద్యార్థి చదవడం అలవాటు చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలనే లక్ష్యంతో బాలచెలిమి నూతన గ్రంథాలయాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎన్.పుల్లయ్య, వి. రమాదేవి, జి.దుర్గయ్య, ప్రభాకరాచార్యులు బాలచెలిమి ఇంచార్జి, విద్యార్థులకు శుభాకాంక్షలు...

– **శ్రీ వేదకుమార్ మణికొండ,** చైర్మన్ చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

పిల్లలకు ఎక్కువ సంతోషాన్నిచ్చేవి బొమ్మలు, ఆటలు, కథల పుస్తకాలు. వీటితో పాటు పిల్లల సృజనాత్మకతకు తోడ్పడే పుస్తకాలను అందిస్తూ విద్యార్థుల్ని ప్రోత్సహించడం కోసం మా పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. విద్యార్దులు బాలచెలిమి కథల పుస్తకాల కోసం పోటీ పడుతున్నారు.

– **ఎన్.పుల్లయ్య,** గ్రంథాలయ ఇంచార్జి

విద్యార్దులలో ఆలోచనా శక్తిని వికాసాన్ని పెంపొందించుటకు బలసాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. బాలల కోసం పెద్దలు వ్రాసిన పుస్తకాలు, పిల్లల కోసం పిల్లలే వ్రాసిన పుస్తకాలు, కథలు, గేయాలు వంటి పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకునేలా అందించారు. గ్రంథాలయం ఏర్పాటు చేయడం కోసం మా పాఠశాలను ఎంపిక చేసినందుకు బాలచెలిమి సంపాదకులు శ్రీ యం. వేదకుమార్ గారికి ధన్యవాదాలు.


**వి. రమాదేవి,** పాఠశాల సహాయకురాలు (తెలుగు)

బాలచెలిమి గ్రంథాలయాన్ని మా పాఠశాలలో ఏర్పాటు చేయడం వలన పిల్లల్లో కొత్త ఉత్సాహం ఏర్పడింది. పుస్తకాలు చదవడమే కాకుండా పుస్తక సమీక్షలు వ్రాసే స్థాయికి తమ విద్యార్థులు ఎదిగారు. ఇందుకు కారణమైన బాల చెలిమికి ధన్యవాదాలు. పిల్లల్లో మరింత ప్రోత్సాహాన్ని కల్పించడం కోసం మా పాఠశాలలో పుస్తక సమీక్షకుల క్లబ్‌ను కూడా ఏర్పాటు చేశాము. బాలచెలిమి గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి మా విద్యార్థులు సమీక్షలు కూడా వ్రాస్తున్నారు. ఉత్తమ సమీక్షలకు బహుమతులు అందచేస్తున్నాము.

**జి.దుర్గయ్య,** పాఠశాల సహాయకులు, (తెలుగు)

– **సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు,**
సి.ఆర్.పి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయం, అశ్వారావుపేట

కథ



# పొదుపు

అదొక పెద్ద పట్టణం. ఆ పట్టణంలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. పెద్ద పెద్ద స్కూల్ల ముందు ఎంతో మంది పిల్లలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యాసంస్థల నాయకులు కనబడుతున్నారు. ఎంతో మంది వ్యాపారస్తులు తమ వ్యాపారాలను జనంలోకి తీసుకెళ్లడానికి ఎన్నో కరపత్రాలను అందరికీ పంచుతున్నారు. కరపత్రాలను తీసుకున్న వారు వాటిని అలాగే రోడ్డుమీదనే పడేస్తున్నారు. ఎక్కడ చూసినా కరపత్రాలు కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. ఎవరు వాటిని పట్టించుకోవడం లేదు.

అదే పట్టణంలో రాము అనే పన్నెండేండ్ల బాలుడు ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. పరీక్షలు అయిపోయిన మరుసటిరోజు రాము వాళ్ళ అమ్మ వారి వీధి చివర ఉన్న సూపర్ మార్కెట్‌కి వెళ్లి చీటీలో రాసిన వస్తువులను తీసుకురమ్మని రాముని పంపింది. రాము ఇంటి నుండి వీధిలోకి అడుగుపెట్టగానే ఆశ్చర్యం వేసింది. ఆ వీధి అంతా ఎన్నో కరపత్రాలతో నిండి ఉంది. రాము ఆలస్యం చేయకుండా వాళ్ళ అమ్మ రాసిచ్చిన వస్తువులను తీసుకువచ్చి అమ్మకి ఇచ్చి, "అమ్మ నాకు ఒక సంచి ఇస్తావా!" అని అడుగుతాడు. అమ్మ నవ్వి ఏమీ మాట్లాడకుండా ఎందుకా అని ఆలోచిస్తూ ఒక సంచిని తెచ్చి ఇస్తుంది.

రాము సంచిని తీసుకొని వీధిలోకి పరిగెడతాడు. అక్కడ పడి ఉన్న వివిధ కరపత్రాలను ఏరి సంచిలో వేసుకోవడం మొదలుపెట్టాడు. రాము చేస్తున్న పనిని చూసి ఆ వీధిలోని కొంతమంది నవ్వుతారు. మరి కొంతమంది ఈ అబ్బాయికి ఏమైంది వీధిలో పడేసిన పనికిరాని పత్రాలను ఏరుకొని ఇంటికి తీసుకెళ్తున్నాడేమిటి? అని రాముని తెలివి తక్కువవాడిలా చూస్తారు. ఇంకొంతమంది వీటిని ఏరి ఏం చేస్తాడు అనుకుంటూ

చూసి చూడనట్టుగా వెళ్ళిపోతున్నారు.

రాము చేస్తున్న పనిని గమనిస్తున్న ఒక వృద్ధుడు రాము దగ్గరికి వచ్చి “బాబు ఏం చేస్తున్నావు?” అని అడుగుతాడు. రాము లేచి నిలబడి “ఏం లేదు తాతయ్య! ఇక్కడ పడి ఉన్న పేపర్లన్నింటినీ ఏరుకుంటున్నాను” అని చెప్తాడు. ఎందుకు బాబు అందరూ వద్దని పరేసిన వాటిని నువ్వు ఏరుకొని ఏం చేస్తావు? అని తాత ప్రశ్నించాడు. ఆ కాగితాలు అన్నిటిని ఏరుకొని ఒకవైపు ఖాళీగా ఉన్న వాటిని ఖాళీగా లేని వాటిని విడదీస్తాను. ఖాళీ లేని కాగితాలను అమ్మితే డబ్బులు వస్తాయని మా స్నేహితులు చెప్పారు. కాబట్టి ఈ కాగితాలలో ఖాళీ లేని వాటిని అమ్మేసి డబ్బులు తీసుకుంటాను. కాళీ ఉన్నా కాగితాలను బొమ్మలు వేయడానికి ఏదైనా రాసుకోవడానికి ఉపయోగిస్తాను. మా దోస్తులకు కూడా ఈ కాగితాలను ఇచ్చి బొమ్మలు గీసుకోమని చెప్తానని అంటాడు. రాము చెప్పిన సమాధానానికి వృద్ధుడు ఆనందపడతాడు రాముని “బాబు ఈ పని చేయమని నీతో ఎవరు చెప్పారు?” అని ప్రశ్నించాడు. రాము వెంటనే నాకు ఎవరు చెప్పలేదు తాతయ్య కానీ మా పాఠశాలలో స్వచ్ఛభారత్ అనే కార్యక్రమం జరిగింది. ఆరోజు మా టీచర్ పేపర్లను తయారు చేయడానికి ఎన్నో చెట్లను నరుకుతున్నారని, కాగితాలను కూడా పొదుపుగా వాడుతూ, చెట్లను పెంచి, వాటిని రక్షించాలని చెప్పింది. అందుకే నేను ఈ పని చేస్తున్నానని చెప్పాడు.

రాము తెలివికి వృద్ధుడు ఎంతో సంతోషించాడు. ఎంతో మంది పెద్దలు పనికిరావు అని పడేసిన కాగితాలను చిన్న బాలుడికి పొదుపుగా వాడడం అనే బాధ్యత ఇంత చిన్న వయసులో అబ్బినందుకు మురిసిపోయి రాముని ప్రశంసించాలనుకుంటాడు. రాముకి 500 రూపాయలు మరియు రెండు, మూడు పుస్తకాలను బహుమతిగా ఇస్తాడు. రాము ఎంతో సంతోషించి తాతయ్యకు థాంక్స్ చెప్పి అక్కడ ఉన్న కాగితాలన్నిటిని ఏరుకొని ఇంట్లోకి వెళ్లిపోతాడు.

అమ్మకు జరిగిన విషయం అంతా చెప్పాడు. రాము వాళ్ళ అమ్మ కూడా ఒక కాగితాన్ని చదివి అక్కడే పడేసిన విషయం గుర్తుకు వచ్చి తాను చేసిన పనికి సిగ్గు పడింది. రాముని మెచ్చుకొని నచ్చిన వంట వండి పెట్టింది.

– పావని
ఎం.ఎ., వీరనారి చాకలి ఐలమ్మ ఉస్మానియా యూనివర్సిటీ.
m : 77805 99057

## సమాచారం

### జాతీయ సైన్స్ దినోత్సవం - సైన్స్ ఫిక్షన్ కథల పోటీ ఫలితాలు

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 28 ఫిబ్రవరి 2026న విద్యార్థుల్లో విజ్ఞాన–సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంపొందించేందుకు సైన్స్ ఫిక్షన్ కథల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వందకు పైగా కథలు అందగా వాటిలో ఉత్తమ కథలను ఎంపిక చేశారు. ఎంపికైన కథలను మాసపత్రికలో ప్రచురించడంతో పాటు భవిష్యత్తులో పుస్తకంగా కూడా తీసుకురావాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 2026 నెలలో బాలచెలిమి మాసపత్రికలో జాతీయ సైన్స్ ఫిక్షన్ కథల పోటీ ప్రకటనను ప్రచురించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులను నిర్వాహకులు అభినందించారు. పాల్గొన్న అందరికీ ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు కన్వీనర్లు ఎ.ఆర్. శర్మ, గరిపల్లి అశోక్ తెలిపారు.

**ఎంపికైన కథలు:**

నిన్ను సరిపోల్చు రోబోట్ – ఆర్. వెంకట్; జ్ఞానోదయం – తితిక్షా చారి; డ్రీమ్ గర్ల్ – కె. కృతిక; అంతరిక్ష రహస్యం – బి. చందన; కలలవనిత – యస్. హర్షిత; కృత్రిమ భవిష్యత్తు – పి. చందనిక; ఆవేశన్ డ్రైవర్ – బెంజామిన్ స్పైడర్; వేరే గ్రహం నుంచి ప్రజల నివాసం – కె. అభిలాష; నీటి కారకం – బైంద క్రాంతి రావు; చంద్రమామ రహస్య డైరీ – ఎ. హారిక; మౌనిక మేధస్సు – ఉ. వేదప్రియ; కాలజ్ఞానం – ఎ. నిరంజన్; మార్పు – కె. హర్షిత; మరోలోకం – పి. వైష్ణవి; ఒంటరితనపు మనుషులు – బి. రంజిత్.

## పుస్తక ఆవిష్కరణ



తేది: 22-02-2026 ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఏవీ డిగ్రీ కాలేజీలో రాష్ట్ర తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో తెలంగాణ సాహితి మహబూబ్‌నగర్ అధ్యక్షులు ఎం.డి. ఖాజామైనద్దీన్ రచించిన “Ruminent Reflections” ఆంగ్ల కవితలు, వ్యాసాల సంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్రంలో ఎడమ నుండి వహీద్ ఖాన్, కె. ఆనందాచారి, శ్రీనిధి విప్లవశ్రీ, ఉదయమిత్ర, ఆవిష్కర్త డా. వి. శ్రీనాథాచారి, రచయిత ఎం.డి. ఖాజామైనద్దీన్, సానె శివశంకర్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా “ప్రేరణ” పుస్తక ఆవిష్కరణ



స్థానిక డైట్ కళాశాలలో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గౌరవ రాజర్షీషా గారు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సంచాలకులు గౌరవ డాక్టర్ పత్తిపాక మోహన్ గారు, శ్రీ పోరెడ్డి అశోక్ గారి చేతుల మీదుగా శ్రీమతి అరుణ బట్టువార్ రచించిన “ప్రేరణ” అనే పిల్లల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ‘రచ్చపల్లి రత్నాలు’ పుస్తకావిష్కరణ

పెద్దపల్లి జిల్లా రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కవితల సంకలనం ‘రచ్చపల్లి రత్నాలు’ పుస్తకాన్ని ఏఎంఓ డా.




పి.ఎం. షేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ చిన్నారుల ఊహాశక్తి అపారమైందని, వారికి చిన్న వయసులోనే చదువు పట్ల ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని అన్నారు. పుస్తకంలో 20 మంది విద్యార్థుల కవితలు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీ మోహనాచార్యుల కృషిని ప్రశంసించారు. తెలుగు ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త కందుకూరి భాస్కర్ పుస్తకాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో MEO పోతు ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సర్పంచ్ రజిత వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సృజనాత్మకతకు ప్రతీకగా ‘గునుగుపూలు’ ఆవిష్కరణ



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగన్నపేటలో 60 మంది విద్యార్థుల కవితలతో రూపొందించిన “గునుగుపూలు” కవితా సంపుటిని ఘనంగా ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ సంటి గంగారం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాల సాహితీవేత్తలు పెందోట వెంకటేశ్వర్లు, వాసరవేని పరుశ రాములు, గరిపల్లి అశోక్, గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లయ్య పాల్గొని విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. గరిపెల్లి అశోక్ మాట్లాడుతూ బాలచెలిమి సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారు పిల్లల సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికి తీసే విధంగా బాలచెలిమి మాసపత్రిక కృషి చేస్తుందని అన్నారు. పుస్తక సంపాదకులు ముత్యాల నరేందర్, కాలువ రాజయ్యతో పాటు పుస్తక సమీక్షకురాలు పర్స రిషికను అతిథులు అభినందించారు. పూర్వ విద్యార్థులు ఆర్థిక సహకారం అందించగా, పాఠశాల ఉపాధ్యాయ బృందం కార్యక్రమంలో పాల్గొన్నారు.

**– బాలచెలిమి డెస్క్**

## ఉర్దూ సాహిత్యానికి కీర్తి తెచ్చిన ప్రముఖ రచయిత్రి

# పద్మశ్రీ జీలానీ బానూ

జీలానీ బానూ (14 జూలై 1936 – 1 మార్చి 2026) భారతదేశానికి చెందిన ప్రముఖ రచయిత్రి, నవలా రచయిత. ఆమె ఉర్దూ, హిందీ, గుజరాతీ మరియు తెలుగు భాషల్లో రచనలు చేశారు. హైదరాబాద్ నగరంతో ఆమెకు సన్నిహిత సంబంధం ఉండటం వల్ల ఆమె రచనల్లో ఆ ప్రాంతంలోని సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. కథలు, నవలలు, వ్యాసాల ద్వారా ఆమె సాహిత్య ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించారు.



జీలానీ బానూ 1936 జూలై 14న ఉత్తరప్రదేశ్‌లోని బదాయూన్ పట్టణంలో జన్మించారు. ఆమెకు సాహిత్య ప్రతిభ తండ్రి హైరత్ బదాయూనీ నుండి వారసత్వంగా వచ్చింది. హైరత్ బదాయూనీ ప్రసిద్ధ కవి. చిన్నప్పటి నుంచే జీలానీ బానూ సాహిత్య వాతావరణంలో పెరిగారు.

చిన్ననాటి నుంచే ఆమెకు చదవడం పట్ల గొప్ప ఆసక్తి ఉండేది. సాదత్ హసన్ మంటో, ఇస్మత్ చుగ్తాయి, మీర్, గాలిబ్, ఇక్బాల్, గోర్కీ, చెకోవ్, మొపాస్సాన్, ఫైజ్, మజాజ్, కుర్రతుల్ ఐన్ హైదర్, అహ్మద్ నదీమ్ ఖాసిమీ వంటి ప్రముఖ రచయితల రచనలు ఆమె చిన్న వయస్సులోనే చదివారు. ఈ రచయితల ప్రభావం ఆమె రచనా శైలిని పరిపక్వతతో తీర్చిదిద్దింది. అయినప్పటికీ ఆమె తన స్వంత శైలిని నిర్మించుకొని, ఏ ఒక్క రచయితను ప్రత్యేకంగా ఆదర్శంగా తీసుకోకుండా స్వతంత్రంగా రచనలు చేశారు.

1952లో ఆమె తొలి కథ “ఎక్ నజర్ ఇదర్ భీ” ను రచించారు. ఆమెకు విశేష ఖ్యాతి తెచ్చిన కథ “మౌమ్ కి మారియం” సవేరా పత్రికలో ప్రచురితమై పాఠకులు మరియు సాహిత్యవేత్తల నుండి మంచి ప్రశంసలను అందుకుంది.

జీలానీ బానూ రచనలు వ్యంగ్యంతో కూడుకున్నవైనా బోధనా ధోరణి ఉండదు. పాఠకులు స్వయంగా నిజం–అబద్ధం నిర్ణయించుకునేలా ఆమె కథలను నిర్మిస్తారు. మధ్యతరగతి జీవనాన్ని సహజంగా చిత్రిస్తూ పాత్రల భావోద్వేగాలను నిజాయితీగా ప్రతిబింబించారు. ఆమె కథల్లోని పాత్రలు జీవితంలో ఎన్నో నిరాశలను ఎదుర్కొన్నప్పటికీ చివరికి సానుకూల మార్గాన్ని కనుగొంటాయి.

ఆమె రచనల ముఖ్య లక్షణం మానవతా దృక్పథం. సమాజంలోని వెనుకబడిన వర్గాల పట్ల, ముఖ్యంగా మహిళల పట్ల ఉన్న సహానుభూతి ఆమె రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. సాధారణ ప్రజలు మాట్లాడే రోజువారీ భాషను ఆమె వినియోగించడం ఆమె రచనలకు సహజత్వాన్ని తీసుకొచ్చింది. ఉర్దూ సాహిత్యానికి కీర్తి తెచ్చిన ప్రముఖ రచయిత్రి– పద్మశ్రీ జీలానీ బానూ.

జీలానీ బానూ సాహిత్య రంగానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 1960లో ఆమెకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు మరియు సోవియెట్ ల్యాండ్ అవార్డు లభించాయి. 1976లో హర్యానా ఉర్దూ అకాడమీ ఆమెకు హాలి అవార్డు ప్రదానం చేసింది. అలాగే భారత ప్రభుత్వం 2001లో ఆమెకు దేశంలోని నాలుగో అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది.

ఈ విధంగా జీలానీ బానూ ఉర్దూ సాహిత్యంలో సామాజిక స్పృహతో కూడిన ప్రముఖ రచయిత్రిగా చిరస్మరణీయ స్థానం సంపాదించారు. ఆమె రచనలు ఉర్దూ సాహిత్యానికి విశిష్టమైన కీర్తిని తీసుకువచ్చాయి.

– సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

*CBS Global Service*

CENTRAL BOOK SHOP
**ABIDS / AMEERPET**

- **SCHOOL BOOKS**
- **GENERAL BOOKS**
- **STATIONARY & GIFTS**




Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026




# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com